# నాన్ ట్యాక్స్ రెవెన్యూపై అధికారులు దృష్టిపెట్టాలి

మొదటి పేజి తరువాయి

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు సహా పలు కొత్త పథకాలను ప్రజలకు అందిస్తున్నాం. బడ్జెట్ నిధులు కొన్ని శాఖలు అధికంగా.. మరికొన్ని శాఖలకు తక్కువగా అందుతున్నాయి. బడ్జెట్‌లో అన్ని శాఖలకు సమానంగా పంచాలి. శాఖల మధ్య ఖర్చు అంతరాలను తగ్గించి.. అన్నింటినీ ఒకే స్థాయిలోకి తీసుకురావాలి. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన ప్రాజెక్టుల ప్రాముఖ్యతను అనుసరించి వెంటనే పూర్తి చేయాలి. రాష్ట్ర అవసరాలు, ప్రాముఖ్యతల మేరకు బడ్జెట్ నిధులు ఖర్చు చేయాలి. రెవెన్యూ తీసుకువచ్చే శాఖలు, విభాగాలపై దృష్టి సారించాలి. పబ్లిక్ ఇంట్రెస్ట్, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాప్రభుత్వం ఆలోచనల మేరకు అందరూ పనిచేయాలి. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సంపూర్ణ స్థాయిలో ముందుకు వెళ్తుంది. రాబోయే పది రోజుల్లో రేషనలైజేషన్ పూర్తి చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలి”అని అధికారులకు భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు.

# ‘సుపరిపాలనలో తొలి అడుగు’ పేరుతో అమరావతిలో సమావేశం

మొదటి పేజి తరువాయి

ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధిపతులు (హెచ్ఓడీలు), ప్రభుత్వ కార్యదర్శులు, మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారు. తొలి ఏడాది సాధించిన ప్రగతిని వివరిస్తూ, రెండో ఏడాదిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. రాబోయే నాలుగేళ్లలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, అభివృద్ధి లక్ష్యాలను ఎలా సాధించాలనే అంశంపై కూలంకషంగా చర్చించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎదురైన ఆర్థిక, పాలనాపరమైన సవాళ్లను అధిగమించి, రాష్ట్రాన్ని పునర్నిర్మాణ పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. స్వల్పకాలిక అభివృద్ధి లక్ష్యాలతో పాటు, ‘వికసిత ఆంధ్రప్రదేశ్’ సాధన కోసం ‘స్వర్ణాంధ్ర ఏ2047’ వంటి దీర్ఘకాలిక ప్రణాళికలను కూడా ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించడం, 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

## కూటమి ప్రభుత్వం మరోసారి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది

మొదటి పేజి తరువాయి

మునుపెన్నడూ లేని విధంగా నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్సీడీ) రూపంలో బాండ్ల జారీకి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన పలు కీలక అంశాలను లేవనెత్తుతూ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్ర శాసనసభ ఆమోదం లేకుండా రాష్ట్ర ఖజానా నుంచి నిధుల ఉపసంహరణకు వీలు కల్పిస్తూ, ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంచిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ది స్టేట్)ని అందుబాటులోకి తెస్తున్నారని జగన్ ఆరోపించారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204లను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, రాష్ట్ర సంచిత నిధిని హామీగా చూపి ఏపీఎండీసీ రుణాలు సేకరించడానికి అనుమతించడం ఆర్టికల్ 293(1)కి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఏపీఎండీసీకి భవిష్యత్తులో వచ్చే ఆదాయం మొత్తంపైనా బాండ్ హోల్డర్లకు ప్రత్యేక హక్కు కల్పించారని, దీనికి అదనంగా సుమారు రూ.1,91,000 కోట్ల విలువైన ప్రభుత్వ ఖనిజ సంపదను కూడా ఎన్సీడీ బాండ్ హోల్డర్లకు తాకట్టు పెడుతున్నారని జగన్ ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసు విచారణలో ఉందని, దీనిని విచారణకు స్వీకరించిన న్యాయస్థానం ప్రతివాదులందరికీ కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు కూడా జారీ చేసిందని జగన్ గుర్తు చేశారు. విషయం న్యాయస్థానం పరిధిలో ఉన్నప్పుడు, ప్రభుత్వం ఏపీఎండీసీని బాండ్ల జారీకి అనుమతించడం ఎంతమాత్రం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. “రాష్ట్ర భవిష్యత్తును, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం వ్యవహరించడం తీవ్ర విచారకరం” అంటూ వైసీపీ అధినేత జగన్ తన ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

### ఇరాన్ పై అమెరికా దాడులు...

# తీవ్రంగా స్పందించిన ఒవైసీ

హైదరాబాద్: ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై అమెరికా జరిపిన దాడుల పట్ల ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఇది అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి (ఐరాస) చార్టర్‌ను పూర్తిగా ఉల్లంఘించడమేనని ధ్వజమెత్తారు. గాజాలో పాలస్తీనియన్లపై జరుగుతున్న మారణహోమాన్ని కప్పిపుచ్చేందుకే అమెరికా ఈ దాడులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఈ దాడులతో ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఆపుతుందని భావించడంలేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడిన ఒవైసీ, అమెరికా చర్యలు కేవలం అంతర్జాతీయ చట్టాలు, ఐరాస చార్టర్‌ను మాత్రమే కాకుండా, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ) మరియు అమెరికా రాజ్యాంగాన్ని కూడా ఉల్లంఘిస్తున్నాయని అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం, అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా ఏ దేశంపైనా యుద్ధం చేయరాదని ఆయన గుర్తుచేశారు. ఇజ్రాయెల్ అణ్వాయుధాల విషయంలో అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని ఒవైసీ ప్రశ్నించారు. “700 నుంచి 800 అణు వార్‌హెడ్‌లు కలిగి, ఎన్‌పీటీపై సంతకం చేయని, ఐఏఈఏ (అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ) ఇన్‌స్పెక్టర్లను అనుమతించని ఇజ్రాయెల్ గురించి ఎవరూ మాట్లాడటం లేదు” అని ఆయన అన్నారు. ఇరాన్ రాబోయే 5 నుంచి 10 సంవత్సరాలలో 90 శాతం యురేనియం శుద్ధి చేస్తుందని, ఇరాన్‌ను ఎవరూ ఆపలేరని, ఆ దేశం ఎన్‌పీటీ నుంచి వైదొలుగుతుందని కూడా ఆయన జోస్యం చెప్పారు. అమెరికా దాడుల నేపథ్యంలో, ఈ ప్రాంతంలోని అరబ్ మరియు ముస్లిం దేశాలు ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని, బ్లాక్‌మెయిల్‌ను ఎదుర్కోవడానికి అణ్వాయుధాలను సమకూర్చుకోవాలని నిర్ణయించుకుంటాయని ఒవైసీ అభిప్రాయపడ్డారు. “మీరు వారిని ఆపలేరు” అని ఆయన అన్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేవని అమెరికా ఇంటెలిజెన్స్ స్వయంగా స్పష్టం చేసిందని, ఈ విషయాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబార్డ్ కూడా చెప్పారని ఒవైసీ ఉటంకించారు. మధ్యప్రాచ్యంలో యుద్ధం వస్తే అక్కడ నివసిస్తున్న 60 లక్షల మంది భారతీయుల భద్రతపై ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో భారతీయ కంపెనీలకు పెట్టుబడులు ఉన్నాయని, అక్కడ పనిచేస్తున్న భారతీయ పౌరులు దేశానికి గణనీయమైన విదేశీ మారక ద్రవ్యాన్ని పంపిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. ఇదే సమయంలో పాకిస్థాన్‌పై కూడా ఒవైసీ విరుచుకుపడ్డారు. మధ్యప్రాచ్యాన్ని యుద్ధంలోకి నెట్టినందుకు ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఇస్లామాబాద్ డిమాండ్ చేస్తోందా అని ఆయన ప్రశ్నించారు. “దీనికోసమేనా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ (జనరల్ అసిమ్ మునీర్) అమెరికా అధ్యక్షుడితో కలిసి భోజనం చేసింది?” అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

### అమెరికా భీకర దాడులు...

# ఇరాన్ అధ్యక్షుడితో మాట్లాడిన ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి




తక్షణమే ఉద్రిక్తతలు తగ్గించి, దౌత్యపరమైన చర్యల ద్వారా శాంతిని పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు నేడు ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పంచుకున్నారు. “ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ పెజెష్కియాన్‌తో మాట్లాడాను. ప్రస్తుత పరిస్థితిపై మేమిద్దరం వివరంగా చర్చించుకున్నాం. ఇటీవల పెరిగిన ఉద్రిక్తతల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాను. తక్షణమే ఉద్రిక్తతలు తగ్గించాలని, చర్చలు, దౌత్యం ద్వారా ముందుకు సాగాలని తెలిపాను. ప్రస్తుత పరిస్థితుల్లో అదే మెరుగైన మార్గమని తెలిపారు. ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వం త్వరగా పునరుద్ధరించాలని స్పష్టం చేశాను” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాగా, అనూహ్య రీతిలో అమెరికా ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై బాంబు దాడులు చేయడం గమనార్హం. ఈ దాడులు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రతిస్పందనలకు దారితీశాయి. ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్‌లలోని తమ అణు కేంద్రాలపై అమెరికా జరిపిన దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇది “క్రూరమైన సైనిక దాడి” అని, అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్థూలంగా ఉల్లంఘించడమేనని అభివర్ణించింది. ఈ దాడుల నేపథ్యంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్యసమితిని, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)ను ఇరాన్ కోరింది.

### ఆరు రోజుల్లోనే రైతుల

# ఖాతాల్లోకి రూ.7,700 కోట్లు

హైదరాబాద్: రైతు భరోసా నిధులను తెలంగాణ ప్రభుత్వం వరుసగా ఆరో రోజూ జమ చేసింది. ఇప్పటి వరకు రూ. 7,700 కోట్లను రైతుల ఖాతాల్లోకి వేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రైతులకు నిధుల పంపిణీలో ఇదే రికార్డుగా పేర్కొంది. రాష్ట్రంలో రైతులకు వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందించటంలో ప్రభుత్వం సరికొత్త రికార్డు నమోదు చేసింది. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. జూన్16న రైతు నేస్తం వేదికగా సీఎం నేరుగా రైతు భరోసా చెల్లింపులను ప్రారంభించారు. తొలి ఆరు రోజుల్లోనే 66.19 లక్షల మంది రైతులకు రూ. 7770.83 కోట్లను జమ చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. “శనివారం నాటికే రాష్ట్రంలో 9 ఎకరాల్లోపు భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. గడిచిన ఏడేళ్లలో ఇంత వేగంగా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం ఇదే మొదటిసారి. గతంలో రైతులకు పంటల పెట్టుబడి సాయం ప్రభుత్వం గరిష్ఠంగా 169 రోజుల వరకు సాగదీసినట్లు పంపిణీ చేసింది. వ్యవసాయ శాఖ రికార్డుల ప్రకారం 2021లో 11 రోజుల వ్యవధిలో రూ.7360 కోట్లు జమ చేయటం ఇప్పటి వరకు ఉన్న రికార్డు. ఇప్పుడు మా ప్రభుత్వం అంతకంటే వేగంగా 6 రోజుల్లోనే రూ.7770 కోట్లు పంపిణీ చేసింది. తొమ్మిది రోజుల్లో మొత్తం రూ.9 వేల కోట్ల పంపిణీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆర్థిక, వ్యవసాయ శాఖలు కృషి చేస్తున్నాయి” అని తుమ్మల తెలిపారు.

## యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్: యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం ఉండేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లో ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ నేతృత్వంలో అద్భుత, సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశలకు అనుగుణంగా భాజపా పాలిస్తోందని చెప్పారు.“కాంగ్రెస్ హయాంలో ఎక్కడ చూసిన అవినీతి వార్తలే. దేశంలో అవినీతి ప్రభుత్వం ఉండవద్దని 2014లో భాజపాని అద్భుత మెజార్టీతో గెలిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాకిస్థాన్ ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉండేది. దేశంలోని పలు ప్రాంతాలను ఉగ్రవాదులు నాశనం చేశారు. హైదరాబాద్‌లోనూ పాక్ ఉగ్రవాదులు రక్తపాతం సృష్టించారు. ఉగ్రవాద కార్యకలాపాలు జరిగినా.. ఏం చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో కాంగ్రెస్ ఉండేది. ప్రస్తుతం ప్రధాని మోదీ నేతృత్వంలో పాక్ దాడులకు గట్టిగా బదులిచ్చాం. ప్రపంచ దేశాలు నివ్వెరపోయేలా గట్టి జవాబు ఇచ్చాం”అని కిషన్‌రెడ్డి అన్నారు.

మోదీ 11 ఏళ్ల పాలన దేశానికి స్వర్ణయుగం: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

తెలంగాణకు మోదీ 11 ఏళ్లలో రూ.11లక్షల కోట్లు ఖర్చు చేశారని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మోదీ 11 ఏళ్ల పాలన దేశానికి స్వర్ణయుగమన్నారు. ఈటల రాజేందర్ ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఈటల ఎంపీ అయ్యి ఏడాది అయిన సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈటల నాయకత్వం రాష్ట్రానికి అవసరమన్నారు. జరగబోయే ఎన్నికల్లో నేతలందరం కలిసి పనిచేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# ఇరాన్ నుంచి ఢిల్లీ చేరుకున్న మరో 311 మంది భారతీయులు

ఢిల్లీ: యుద్ధ వాతావరణంతో అట్టుడుకుతున్న ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయ పౌరులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన ‘ఆపరేషన్ సింధు’ ముమ్మరంగా కొనసాగుతోంది. అమెరికా బాంబర్ విమానాలు ఇరాన్‌లోని కీలక అణు కేంద్రాలపై దాడులు చేయడంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ క్లిష్ట పరిస్థితుల నడుమ, తాజాగా మరో 311 మంది భారతీయులు ఇరాన్‌లోని మష్హద్ నగరం నుంచి ప్రత్యేక విమానంలో దేశ రాజధాని ఢిల్లీకి సురక్షితంగా చేరుకున్నారు. ఈ తరలింపు వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆదివారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. “ఆపరేషన్ సింధు కొనసాగుతోంది. జూన్ 22వ తేదీ సాయంత్రం 4:30 గంటలకు మష్హద్ నుంచి ప్రత్యేక విమానంలో 311 మంది భారతీయ పౌరులు న్యూఢిల్లీకి చేరుకున్నారు. దీంతో ఇరాన్ నుంచి ఇప్పటివరకు మొత్తం 1,428 మంది భారతీయులను సురక్షితంగా తరలించగలిగాం” అని ఆయన తన ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశమైన ఇరాన్ నుంచి తరలిస్తున్న వారిలో కశ్మీరీ విద్యార్థులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. సంఘర్షణలమయమైన ప్రాంతం నుంచి విద్యార్థులను సురక్షితంగా తీసుకువస్తున్నందుకు జమ్మూకశ్మీర్ విద్యార్థుల సంఘం కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది. “ఇరాన్‌లోని మష్హద్ నుంచి 200 మంది కశ్మీరీ విద్యార్థులతో సహా 280 మందికి పైగా భారతీయ విద్యార్థులతో మహాన్ ఎయిర్ విమానం ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ఆందోళనతో ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఇది గొప్ప ఉపశమనం కలిగించే క్షణం” అని జమ్మూకశ్మీర్ విద్యార్థుల సంఘం ఎక్స్ లో పేర్కొంది. “మా విద్యార్థులను మష్హద్ నుంచి సురక్షితంగా తరలించడంలో తక్షణమే స్పందించి, అవిశ్రాంతంగా సమన్వయం చేసి, మద్దతు అందించిన విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, ప్రభుత్వ అధికారులకు, ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ కృషే మా విద్యార్థులను ఇంటికి చేర్చింది” అని ఆ సంఘం హర్షం వ్యక్తం చేసింది.

# ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం... బంగారం ధరలు భగ్గుమనే అవకాశం!

పశ్చిమాసియాలో తీవ్ర అస్థిరత

ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులతో భయాందోళనలు

సురక్షిత పెట్టుబడిగా పసిడి వైపు మొగ్గు చూపుతున్న ఇన్వెస్టర్లు

బంగారం ధర 3,500 డాలర్ల నుంచి3,700 డాలర్ల మధ్య ఉండొచ్చని అంచనా

వెండి ధర కూడా బంగారం బాటలోనే, కాస్త నెమ్మదిగా పెరిగే సూచనలు




ఢిల్లీ: పశ్చిమాసియాలో తాజాగా చెలరేగిన ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితిని మరింత తీవ్రతరం చేయడంతో బంగారం ధరలు భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు జరపడం పెట్టుబడిదారులలో తీవ్ర ఆందోళన రేకెత్తించింది. దీంతో వారు బంగారం వంటి సురక్షిత పెట్టుబడుల వైపు దృష్టి సారిస్తున్నారు. వాస్తవానికి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైనిక చర్యకు బదులుగా దౌత్యపరమైన చర్చలను ఎంచుకోవచ్చని మార్కెట్లు ఆశించడంతో శుక్రవారం నాడు బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే, న్యూయార్క్‌లో ట్రేడింగ్ ముగిసే సమయానికి ధరలు తిరిగి పుంజుకున్నాయి. రోజువారీ చార్టులో ఏర్పడిన లాంగ్ లోయర్ షాడో, వారాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు ముందే ఊహించినట్లు సూచించింది. రాబోయే వారాల్లో బంగారం ధర ఔన్సుకు 3,500 డాలర్ల నుంచి 3,700 డాలర్ల శ్రేణిలో ట్రేడ్ కావచ్చని నిపుణులు భావిస్తున్నారు. యాక్సిస్ సెక్యూరిటీస్‌కు చెందిన అక్షయ్ చించాల్కర్ మాట్లాడుతూ, స్పాట్ గోల్డ్ ధర 3,314 డాలర్లపైన ఉన్నంత కాలం, అది 3,770 డాలర్ల దిశగా మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఆప్షన్స్ మార్కెట్ కూడా బుల్లిష్ ట్రెండ్‌ను సూచిస్తోందని, చాలా మంది పెట్టుబడిదారులు ధరల పెరుగుదలపై పందెం కాస్తున్నారని ఇది తెలియజేస్తోందని ఆయన వివరించారు. బంగారం ధరల పెరుగుదల వల్ల వెండి కూడా ప్రయోజనం పొందుతుందని, అయితే దాని పెరుగుదల నెమ్మదిగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. వెండి ధర 40 డాలర్ల వైపు పెరగవచ్చని, 33.68 డాలర్ల వద్ద మద్దతు లభిస్తుందని భావిస్తున్నారు. గత 10 సంవత్సరాలుగా వెండి, బంగారం మధ్య బలమైన సానుకూల సంబంధం ఉందని, సాధారణంగా వెండి బంగారం బాటలోనే నడుస్తుందని చించాల్కర్ పేర్కొన్నారు. 2025లో ఇప్పటివరకు బంగారం 25 శాతానికి పైగా, వెండి 24 శాతానికి పైగా లాభపడ్డాయి. ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి పెరుగుతున్న నష్టాలకు వ్యతిరేకంగా పెట్టుబడిదారులు విలువైన లోహాల వైపు మొగ్గు చూపుతున్నారని ఇది స్పష్టం చేస్తోంది.

# సజ్జలపై క్రిమినల్ కేసు నమోదు



అమరావతి: వైసీపీ సీనియర్ నేత, ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదైంది. రాజధాని ప్రాంత మహిళలపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు ఫైల్ అయింది. సజ్జల రామకృష్ణారెడ్డి రాజధాని అమరావతికి చెందిన మహిళల గురించి కొన్ని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని కంభంపాటి శిరీష తన ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆమె ఆరోపించారు. శిరీష అందించిన ఫిర్యాదును స్వీకరించిన తాడేపల్లి పోలీసులు, ప్రాథమిక విచారణ అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డిపై సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

## శ్రీశైలం ప్రాజెక్టుకు పోటెత్తిన వరద

శ్రీశైలం: మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి వరద పోటెత్తుతోంది. పైనుంచి వస్తున్న వరద నీటితో జూరాల డ్యామ్ ఇప్పటికే నిండుకుండలా మారింది. ఈ సీజన్ లో రెండోసారి అధికారులు డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. దీంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరుకుంటోంది. శ్రీశైలం డ్యామ్ నెమ్మదిగా నిండుకుంటోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 60,587 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందని అధికారులు చెప్పారు. అయితే, డ్యామ్ నుంచి ప్రస్తుతానికి నీటిని వదలడంలేదని తెలిపారు. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం 854.20 అడుగులకు చేరింది. శ్రీశైలం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 215.7080 టీఎంసీలు, ప్రస్తుతం 89.7132 టీఎంసీలకు చేరిందని అధికారులు వివరించారు. ప్రస్తుతం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశామని చెప్పారు.

## జగన్ వాహనం కింద పడి సింగయ్య నలిగిపోయిన దృశ్యాలు భయానకం: షర్మిల




అమరావతి: వైసీపీ అధ్యక్షుడు జగన్ వాహనం కింద పడి సింగయ్య నలిగిపోయిన దృశ్యాలు భయానకం అంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. ఒళ్ళు గగుర్పొడిచేలా ఉంది ఈ ఘటన అంటూ సోషల్ మీడియాలో స్పందించారు. ఈ మేరకు జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కారు కింద ఒక వ్యక్తి పడ్డారన్న సోయి లేకుండా కాన్వాయ్ కొనసాగడం ఏంటి ? 100 మందికి పర్మిషన్ ఇస్తే వేల మంది ముందు సైడ్ బోర్డు మీద నిలబడి జగన్ చేతులూపడం ఏంటి? అంటూ మండిపడ్డారు. “ప్రజల ప్రాణాలు తీసే హక్కు మీకు ఎవరిచ్చారు ? బెట్టింగ్ లో ఓడిపోయి సూసైడ్ చేసుకున్న వ్యక్తి విగ్రహ ఆవిష్కరణకు ఇద్దరిని బలి ఇస్తారా ? ఇదేం రాజకీయం ? ఇదెక్కడి రాక్షస ఆనందం ? మీ ఉనికి కోసం జనాలను టైర్ల కింద తొక్కుకుంటూ పోతారా ? ప్రజల ప్రాణాల మీద శవ రాజకీయాలు చేస్తారా ? కార్ సైడ్ బోర్డ్ మీద నిలబడి ఒక నాయకుడిగా కాన్వాయ్ మూవ్ చేయించడం సబబేనా ? ఇది పూర్తిగా జగన్ గారి బాధ్యత రాహిత్యానికి అద్దం పడుతుంది. బలప్రదర్శన చేసి సింగయ్య మృతికి కారణమైన జగన్, 100 మందికి అనుమతి ఇచ్చి వేల మందితో వచ్చినా దగ్గరుండి మరి చోద్యం చూసిన కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి. పర్మిషన్ కి విరుద్ధంగా జన సమీకరణ జరుగుతుంటే పోలీసులు ఎలా సహకరించారు? ఎందుకు ప్రేక్షక పాత్ర వహించారు? ఎందుకు ఇంటలిజెన్స్ వ్యవస్థను నిద్ర పుచ్చారు? ప్రజా సమస్యలపై పోరాడితే ఆంక్షలన్నీ కాంగ్రెస్ పార్టీకేనా? కాంగ్రెస్ చేసే ఉద్యమాలకు, ధర్నాలకు హౌజ్ అరెస్ట్ లు చేస్తారు. దీక్షలను భగ్నం చేస్తారు. ర్యాలీలను తొక్కిపెట్టి మా గొంతు నొక్కుతారు. వైసీపీ చేసిన బలప్రదర్శనలకు, హత్యలకు జగన్ ఏం సమాధానం ఇస్తారు ? చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల కూటమి ప్రభుత్వం దీనికి ఏం సమాధానం చెబుతుంది? దీనిపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?” అంటూ షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు జగన్ కాన్వాయ్ వీడియో కూడా పంచుకున్నారు.



### విశాఖ యోగా కార్యక్రమానికి

# గిన్నిస్ రికార్డు.. ప్రధాని మోదీ హర్షం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో యోగాను ఒక జీవన విధానంగా మార్చేందుకు జరుగుతున్న కృషిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. ముఖ్యంగా, విశాఖపట్నంలో జరిగిన యోగా కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, యోగా ప్రాముఖ్యతను మరోసారి నొక్కిచెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు యోగాను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకునే ఉద్యమాన్ని బలోపేతం చేసిన తీరు అభినందనీయమని పేర్కొన్నారు. “యోగా మరోసారి ప్రజలను ఏకం చేసింది! ఆంధ్రప్రదేశ్ ప్రజలు యోగాను తమ జీవితంలో భాగం చేసుకునే ఉద్యమాన్ని బలోపేతం చేసిన విధానానికి అభినందనలు. నేను కూడా పాల్గొన్న విశాఖపట్నంలోని యోగాంధ్ర కార్యక్రమం అనేక మందిని మంచి ఆరోగ్యం, శ్రేయస్సు దిశగా ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంది” అంటూ ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఇది ప్రజల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని ప్రధాని తన సందేశంలో స్పష్టం చేశారు. ప్రజలంతా యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని జరగాలని ప్రధాని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రజలు యోగా విస్తరణకు చేస్తున్న కృషి ఇతర రాష్ట్రాలకు కూడా స్ఫూర్తిదాయకమని ఆయన అభిప్రాయపడ్డారు.



# తన రియల్ లైఫ్ క్యారెక్టర్ తో సినిమా...

పవన్ కళ్యాణ్ ఏమన్నారంటే...!

పూర్తిగా నచ్చిన పాత్ర ఇంకా చేయలేదన్న పవన్

అమరావతి: ప్రముఖ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన సినీ, రాజకీయ ప్రస్థానంపై పలు ఆసక్తికర విషయాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తాను ఇప్పటివరకు పోషించిన పాత్రల్లో ఏ ఒక్కటీ తనకు పూర్తిస్థాయిలో సంతృప్తినివ్వలేదని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, “ఇప్పటిదాకా నేను చేసిన ఏ పాత్ర కూడా నా మనసుకు పూర్తిగా దగ్గరవ్వలేదు. ప్రతి పాత్రలోనూ కొన్ని అంశాలు మాత్రమే నాకు నచ్చాయి. నిజ జీవితంలో నేను ఎలా ఉంటానో, తెరపైనా అలాగే కనిపించాలని నా కోరిక. కానీ, సినిమాల్లో అది కుదరకపోవచ్చు. అలాంటి సినిమాకు జనాదరణ లభించదేమో!” అని అన్నారు. భారతీయ సినిమా రంగం గురించి మాట్లాడుతూ, ఒకప్పుడు బాలీవుడ్‌లో దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే మంచి చిత్రాలు వచ్చేవని గుర్తుచేశారు. “ప్రస్తుతం ‘దంగల్’ వంటి ప్రభావవంతమైన సినిమాలు రావడం లేదు. ప్రేక్షకుల అభిరుచులకు తగిన కథలను అందించడంలో వారు వెనుకబడుతున్నారేమో!” అని అభిప్రాయపడ్డారు. నటన నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించడం గురించి పవన్ వివరిస్తూ, తన తండ్రి తనకు స్ఫూర్తి అని తెలిపారు. “నేను నటుడిని కావాలని గానీ, సినిమాల్లోకి రావాలని గానీ ఎప్పుడూ అనుకోలేదు. మాది ఒక మధ్యతరగతి కుటుంబం. మా నాన్నగారు ప్రభుత్వ ఉద్యోగి, ఆయనకు కమ్యూనిస్టు భావజాలం ఉండేది. ఆయన ప్రభావం వల్లే మా కుటుంబ సభ్యులందరికీ రాజకీయాలపై కొంత అవగాహన ఏర్పడింది. నేను అనుకోకుండానే సినిమాల్లోకి అడుగుపెట్టినా, నా దృష్టి ఎప్పుడూ సమాజంపైనే ఉండేది. ఆ ఆలోచనల నుంచే రాజకీయాల్లోకి ప్రవేశించాను” అని పవన్ కళ్యాణ్ వివరించారు.

## విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి.
### టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం రాజశేఖర్ రెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. టీఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బక్క శ్రీనివాస్ చారి అధ్యక్షతన ఆఫీస్ బేరర్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కొంతమంది ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిప్యూటేషన్లతో వెళుతున్నారు. వారు పీఏ పల్లి, అడవిదేవులపల్లి, చందూరు, గుడిపల్లి లాంటి మండలాల నుండి హైవే ప్రాంతాలైన కట్టంగూరు, నకిరేకల్లు, కేతపల్లి మండలాలకు అక్రమంగా డిప్యూటేషన్ పై రావటం జరుగుతుంది. ఈ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలి. లేనట్లయితే జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు పోరాట కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులు మ్యూచువల్ బదిలీలలో భాగంగా వారి ఇష్టంతో పీఏ పల్లి లాంటి మండలాలకు వచ్చి వారి పలుకుబడిన ఉపయోగించుకొని పట్టణ ప్రాంతాలకు దగ్గర ప్రదేశాలకు డిప్యూటేషన్ లపై వెళుతున్నారు .వాస్తవంగా వెనుకబడిన మారముల మండలాలకు ఉపాధ్యాయులు అవసరం ఉంది. అక్కడ ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వర్గాల విద్యార్థులు అధికంగా ఉన్నారు. పిల్లల అవసరాలు చూడకుండా ఇలా అక్రమ డిప్రెషన్ ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల అవసరాలకు కాకుండా ఉపాధ్యాయుల వ్యక్తిగత అవసరాల కొరకు ఈ డిప్యూటేషన్లను ఉపయోగించుకుంటున్నారు. కావున ఇలా డిప్యూటేషన్ పై వెళ్లిన వారిని వెంటనే వెనుకకు పిలిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జి నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షులు బి అరుణ, నర్రా శేఖర్ రెడ్డి, కోశాధికారి వడిత్య రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, సిహెచ్ .అరుణ, జిల్లా కార్యదర్శులు సిహెచ్ రామలింగయ్య, గేర నరసింహ, ఎం శ్రీనివాసరెడ్డి, నలపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమరాజు సైదులు, వై. యాదగిరి, చిన్న వెంకన్న, వేదశ్రీ, మురళయ్య, నరసింహమూర్తి, భాను ప్రకాష్, వరలక్ష్మి, ఎర్ర నాగుల సైదులు, రాగి రాకేష్, గిరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఐక్యతకు వ్యతిరేకంగాఉన్న కుల వ్యవస్థపై పోరాడాలి







నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. : సమాజంలో పేదల ఐక్యతకు వ్యతిరేకంగా కులవ్యవస్థ తీవ్ర రూపం దాల్చిందని, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుదామని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపెట్ల స్కైలాబ్ బాబు అన్నారు. ఆదివారం రోజున కెవిపిఎస్ నల్లగొండ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల కట్టంగూరు మండల కేంద్రంలోని వైవిఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగినవి. ఈ సందర్భంగా ప్రారంభ ఉపన్యాసం చేస్తూ స్కైలాబ్ బాబు మాట్లాడుతూ నిచ్చెన మెట్ల వ్యవస్థ ద్వారా కింది కులాలను పైకులాలను అత్యంత హీనమైన స్థితిలో చూస్తున్నారని కుల వ్యవస్థ వలన సమాజ అభివృద్ధికి ఆటంకంగా మారిందని అన్నారు. మనుషులను మనుషులుగా చూసి పరిస్థితులు లేవని తెలియజేశారు. దళితులు సామాజిక ఆర్థిక సమానత్వం కోసం అంటరానితనం పోవాలని ఆత్మగౌరవంగా జీవించాలని కుల నిర్మూలన ప్రధాన లక్ష్యంతో సంఘం ఏర్పడిందని అన్నారు దళితులు ఎదుర్కొంటున్న 56 రకాల వృక్షారూపాలను గుర్తించి వాటిపై అనేక సామాజిక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించామని తెలిపారు దళితులపై జరుగుతున్న దాడులు హత్యలు అత్యాచారాలు వివేక్ష రూపాలను అరికట్టడానికి ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఉండాలని పోరాటాల నిర్వహించి ప్రభుత్వంతో ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయించిందినీ కెవిపిఎస్ అని అన్నారు. ఇటీవల కాలంలో దళితుల మైనారిటీల అభ్యుదయ శక్తులపై దాడులు దౌర్జన్యాలు హత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు దేశ సమైక్యతకు వేగాతం కలిగిస్తున్న మతోన్మాదాన్ని అనువాదాన్ని నిర్మూలించాలని తెలిపారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. దళితులకు సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిపివేశారని అన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను నిర్వీర్యం చేశారని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్క లబ్ధిదారునికి కూడా రుణం ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు. ఇండస్ట్రియల్ ద్వారా ఇచ్చే రుణాలను నిలిపివేశారని గత నాలుగు సంవత్సరాలుగా సబ్సిడీలు రావడం లేదని అన్నారు. నిరుద్యోగ యువకులకు సబ్సిడీ ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లులేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాది పనులు పేదలకు దొరకడం లేదని సరియగు కూలీ ఇవ్వడం లేదని కోరిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్లో సమస్యలపై ఉద్యమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందుబాటులో లేదని ప్రభుత్వ దవాఖానాలలో సర్వేలు నిర్వహించి పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడానికి పోరాడుతామని తెలిపారు. ఈ శిక్షణా తరగ తులకు ప్రిన్సిపల్ గా కొండేటి శ్రీను ఉన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెవిడాల పరుశరాములు,కోడి రెక్క రాధిక, జిల్లా ఉపాధ్యక్షులు ఒంటెపాక కృష్ణ,పెరిగే విజయకుమార్, గాదే నరసింహ, జిల్లా సహాయ కార్యదర్శిగా దైద శ్రీను, బొళ్ళు రవీంద్ర కుమార్, కోడి రెక్క మల్లన్న,పెరిక విజయ కుమార్,జిల్లా కమిటీ సభ్యులు దండు రవి, డైదా దేవయ్య, టాక్కేళ్లపల్లు శ్యామ్, వంగూరి శ్యామ్,బోల్లేపల్లి రవి, బొంగురాల వెంకన్న, చిలుమల రామస్వామి, దండు రవి, వంగూరి వెంకన్న, బొల్లంపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట ప్రధాన అంతరాలయంలోకి వెళ్లే భక్తులకు తప్పనిసరిగా లుంగి మాత్రమే ఉండాలి
### దేవాదాయకం శాఖా కమిషనర్ ఆలయ ఈవో వెంకట్రావు ఆదేశాలు




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో ప్రధాన అంతరాలయంలోకి వెళ్లే భక్తులకు తప్పనిసరిగా లొంగి మాత్రమే ఉండాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఆలయ ఈవో వెంకట్రావు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ దానిని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా బ్రేక్ దర్శనాలలో వెళ్లే భక్తులు తప్పనిసరిగా లుంగీ మాత్రమే ధరించాలని తాటికాయంత అక్షరాలతో దేవస్థానం అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ భక్తులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ఎవరు చూస్తారులే అని లోపల పాయింటు బయటికి మాత్రం లుంగీ కట్టుకొని వెళుతున్నారు.ఇదంతా ఆ సమయాలలో విధులు నిర్వహించే అధికారులు చూసి కూడా మందలించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.నిజానికి అంతరాలయం గడప దాటి స్వయంభు మూర్తుల దగ్గరి వరకు వెళ్లి స్వామివారి దర్శనం చేసుకోవాలి అంటే లుంగీ మాత్రమే ధరించాలి.లేదంటే అపచారం చేసినట్లుగా భావించవలసి ఉంటుంది.స్వామివారి ఆగ్రహానికి కూడా గురికావాల్సి ఉంటుంది. అందుకే సాంప్రదాయ దుస్తులైన లుంగీ ధరించిన వారికి మాత్రమే గర్భాలయ మూర్తుల దర్శనం ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుకుంటున్నారు.ప్రధాన ఆలయంలో పనిచేసే ఉద్యోగులు కూడా..... ప్యాంటు లుంగీ ఆలయంలో పనిచేసే సిబ్బంది కూడా లోపల పాయింటు బయట లుంగీ ధరించి విధులు నిర్వర్తిస్తున్నారని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బ్రేక్ దర్శనాలకు వెళ్లే భక్తులను అడిగితే ప్రధాన ఆలయంలో పనిచేసే ఉద్యోగస్తులే లోపల పాయింటు బయట లొంగి ధరించి విధులు నిర్వర్తిస్తున్నారని, వివాదాలకు దిగుతున్నారు.ఇప్పటికైనా ఆలయ ఉన్నత అధికారులు ప్రధానాలయంలో పనిచేసే ఉద్యోగులైన ,సిబ్బందైన , లుంగీ ధరించి విధులు నిర్వర్తించే విధంగా చూడాలని, స్వామివారి ప్రతిష్టకు భంగం కలగకుండా కాపాడాలని మరియు బ్రేక్ దర్శనాలలో వెళ్లే భక్తులు ఎవరైనా సరే లుంగీ మాత్రమే ధరించే విధంగా చూడాలని నరసన్న భక్తులు కోరుకుంటున్నారు.మరి అధికారులు ఎంతవరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## కొబ్బరికాయలు కొట్టి ఇందిరమ్మ ఇంద్ర
### భూమి పూజ చేసిన తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ సుధా....



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భారత దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగినదిగా తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎరుకల సుధా హేమేందర్ గౌడ్ అన్నారు. ఆదివారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో ఆమె కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొని కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గానికి అత్యధిక ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంధారపు బిక్షపతి గౌడ్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేష్ యాదవ్, నాయకులు కలకుంట్ల శేఖర్ గౌడ్, బాలు నర్సయ్య, సుధగాని రాజాలు గౌడ్, గోపాల్ గౌడ్, కమ్లికారీ జహంగీర్, ముక్కెర్ల వెంకటేష్ యాదవ్, గుండ్లపల్లి లింగం గౌడ్, బందారపు ఐలయ్య గౌడ్, సత్యనారాయణ, మున్సిపల్ వార్డు అధికారి నరసింహ, సృజన, తదితరులు పాల్గొన్నారు....

## సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ కరపత్రం ఆవిష్కరణ.
### సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ మాలోతు సైదా నాయక్ –
### సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్ –



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:జూన్ 26 న సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ లో జరిగే సేవాలాల్ రాష్ట్ర మహాసభ కరపత్రాలను కోదాడ బాలాజీ నగర్ లో సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ మాలోతు సైదా నాయక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైదా నాయక్ మాట్లాడుతూ బంజారా సమాజానికి సంక్షేమ అభివృద్ధికై నిరుద్యోగుల సమస్యలపై జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించేందుకు మనమందరం ఏకతాటికి రావాలని బంజర సమాజాని మరొక యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు, బాలు నాయక్, భూక్య పంతులు నాయక్, జగ్గు నాయక్,దారావత్ కోటేష్ నాయక్ గుగులోతు రాము నాయక్, సైదులు నాయక్, ఇస్లావత్ రవి నాయక్, రాజేష్ నాయక్, లావూరి శ్రీనివాస్ నాయక్, అజ్మేరా రాము నాయక్, భూక్యా రామ్, అజ్మీరా సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బ్రాహ్మణ సంఘం
### ఉపాధ్యక్షులు కాచరాజు జయప్రకాష్ రెండవ వర్ధంతి



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :రాష్ట్ర బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షులు కాచరాజు జయప్రకాష్ రెండవ వర్ధంతి సభ బోనగిరిలో కాచరాజు మినీ హాల్లో నిర్వహించడం జరిగినది .ఈ సమావేశానికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకవరం రమేష్ దానం రామేశ్వరరావు అధ్యక్షత నిర్వహించినారు ఈ సమావేశంలో కచ రాజు వివిధ సంఘాల కార్యక్రమంలో నిర్వహించిన పాత్రను , అనేక పర్యాయాలు ఆయన నిర్వహించిన సమావేశాలను వివరిస్తూ సమావేశంలో హాజరైన పెద్దలు వాక్యానించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు పోచంపల్లి రమణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందుపట్ల విశ్వేశ్వరరావు , బిజెపి సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, పట్టణ బిజెపి మాజీ అధ్యక్షులు పాదరాజు ఉమా శంకర్ రావు , కృష్ణమూర్తి , రామ్మూర్తి , కడారి వెంకటేష్ దానం రామేశ్వరరావు , అమిద , ముత్తిరెడ్డి , మధు, భాస్కర్ రావు , ఎన్ వి డి నాగేశ్వరరావు సకిలం సురేందర్రావు శ్రీకాంత సిహెచ్ రామ్మోహన్రావు , వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు ఈ సమావేశంలో కాచరాజు కి , వారి శ్రీమతి, కూతురు మనుమలు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.

## ప్రైవేట్ సంస్థల దోపిడి అరికట్టాలి
### - సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్



లోకల్ గైడ్/తాండూర్: ప్రైవేట్ పాఠశాల కళాశాలలో అధిక ఫీజుల దోపిడిని అరికట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం,సిఐటియు,ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సంఘం నాయకులు మీడియాతో మాట్లాడుతూ. .తాండూరు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల, జూనియర్ కళాశాలలో...అధిక ఫీజుల దోపిడిని అరికట్టాలని వారు తెలిపారు.బుక్స్ పేరుతో, యూనిఫామ్ పేరుతో, అడ్మిషన్ పేరుతో...అధిక ఫీజుల దోపిడిని అరికట్టడంలో, ప్రభుత్వ అధికారులు, జిల్లా డీఈవో, కలెక్టర్ స్పందించి, ప్రైవేటు పాఠశాలలు, కలశాలలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా అనుమతి లేని పాఠశాలలపై, కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ప్రభుత్వ నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని అధికారులను కోరారు.ప్రభుత్వం, బడిబాట కార్యక్రమాని నిర్వహించడమే కాదు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎంపీ,ఎమ్మెల్యే,ఎంపిటిసి, జడ్పిటిసి,సర్పంచ్ అందరి పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని,అప్పుడే నిజమైన బడిబాట కార్యక్రమానికి సార్థకం ఉంటుందని అన్నారు.కాగా ప్రభుత్వం...విద్యకు అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రయ్య,కేవిఎన్ పిఎస్ జిల్లా నాయకులు రత్నం, తదితరులు పాల్గొన్నారు.

## రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్దే చంద్రబాబు ధ్యేయం.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.:రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎక్కడున్నా బాగుండాలనే చంద్రబాబు కోరుకుంటారని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింలు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెదేపా నియోజకవర్గ కోఆర్డినేటర్ ఓరుగంటి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కెసిఆర్ మిత్రుడు జగన్మోహన్ రెడ్డి ప్రగతిభవన్ లో నాడు రాయలసీమను రతనాల సీమ గా చేసేందుకు గోదావరి నీళ్లు అవసరమని అన్నాడని నేడు అల్లుడు హరీష్ రావు బనకచర్ల ప్రాజెక్టు పట్ల అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాలు చంద్రబాబు నాయుడుకి రెండు కళ్ళలాంటివాని తెలంగాణకు అన్యాయం చేసే పని చంద్రబాబు నాయుడు చేయబోరని అన్నారు. 2014 రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో కూడా 15 మంది టిడిపి ఎమ్మెల్యేలను గెలిపించి ప్రజలు ఆదరించారని ఆంధ్ర తెలంగాణ ప్రాంతీయ విభేదాల వల్ల ఆంధ్ర పార్టీ అని ముద్ర వేయడం వల్ల పార్టీకి నష్టం జరిగిందన్నారు. ప్రాంతీయ విభేదాలు బలహీనపరిచిన ప్రజల్లో నేటికీ పార్టీ పట్ల విశ్వాసం ఉందన్నారు. అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 200 మంది కార్యకర్తలకు పార్టీ కండువలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అన్నారు. కోదాడ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఓరుగంటి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, పార్లమెంట్ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ రాష్ట్ర కార్యదర్శి ముత్తినేని సైదేశ్వర రావు, కోదాడ నియోజకవర్గ పరిశీలకులు నాతాల రామిరెడ్డి, భువనగిరి పార్లమెంట్ కన్వీనర్ కృష్ణమాచారి, గుండ్లపల్లి ఆనంద్, మందవ వెంకటేశ్వర్లు, కోదాడ పట్టణ అధ్యక్షులు జనపనేని కృష్ణ, భయ్యా నారాయణ, వేమూరి సత్యనారాయణ, కోడె వాసు కీసర నాగయ్య, కొమ్మ గాని వెంకటేశ్వర్లు, కొల్లు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



యాచారం సూర్య న్యూస్ ( జూన్ 22):. మండల పరిధిలో అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన కొప్పు అశోక్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. చెందిన విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు 2001- 2002 పదవ తరగతి బ్యాచ్ తన స్నేహితుడు కుటుంబానికి తమ వంతు సహాయం చేయాలని పూనుకున్నారు. స్నేహమంటే బతికుండగా చట్టపట్టలేసుకొని తినడం కాదు స్నేహితుల మరణించిన తర్వాత కూడా తన కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్న బాల్యమిత్రులు తమతో పాటు చదువుకున్న మిత్రులందరిని కలుపుకొని తోటి స్నేహితుడైన అశోక్ కుటుంబ సభ్యులకు 1 లక్ష రూ. ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో తమ పిల్లల చదువుల కోసం ఎలాంటి సహకారం కావాలన్నా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని వారికి ధైర్యాన్ని కల్పించారు. తమ బ్యాచ్ లో ఏ ఒక్కరికి ఆపద వచ్చిన సహాయం చేయడంలో ముందుంటామని తెలిపారు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. మా కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి
### ఆదివారం షాద్ నగర్ పట్టణంలో విలేకరుల సమావేశం



షాద్ నగర్ ప్రభాత సూర్య ప్రతినిధి (జూన్ 22): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా నేడు సోమవారం ప్రతి పోలింగ్ బూత్ లో 100 మొక్కలు నాటే కార్యక్రమాని విజయవంతం చేయాలని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ కన్వీనర్ టంగుటూరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పర్యావరణ నియోజకవర్గం ఇంచార్జి పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి , సీనియర్ నాయకులు ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబెర్ చెంది మహేందర్ రెడ్డి ,ప్రోగ్రామ్ జిల్లా కో కన్వీనర్ కక్కునూరి వెంకటేష్ గుప్త పాల్గొన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. బిజెపి రాష్ట్ర పార్టీ, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు నేడు సోమవారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా ప్రతి పోలింగ్ బూత్ లో 100 మొక్కలు నాటే కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా నేడు సోమవారం జన సంఘ్ వ్యవస్థాపకులు డా,, శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్ లలో ఆ మహనీయుని చిత్ర పటానికి పూలమాల తో శ్రద్ధాంజలి ఘటించాలని కోరారు. భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు “అమ్మకు వందనం” కార్యక్రమం లో భాగంగా ప్రతి పోలింగ్ బూత్ లో వంద మొక్కలు నాటాలని కార్యకర్తలకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, చేగు సుధాకర్, శ్యామ్ సుందర్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్,తదితరులు ఉన్నారు.

## డాక్యుమెంటేషన్ రైటర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి
# జి. అభినవ్ కు ఘనంగా సన్మానం
### సన్మానం పట్ల సంతోషం వ్యక్తం చేసిన జి. అభినవ్



షాద్ నగర్ ప్రభాత సూర్య ప్రతినిధి (జూన్ 22): ఎలికట్ట గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు షాద్ నగర్ డాక్యుమెంటేషన్ రైటర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన జి. అభినవ్ ను ఆయన పదో తరగతికి చెందిన బ్యాచ్ మిత్రులు పాల్గొని శాలువాలతో సన్మానం చేసి ఘనంగా సత్కరించారు. తమ బ్యాచ్ కు చెందిన చిన్ననాటి మిత్రుడు ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల ఆయన మిత్రులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినవ్ ఇంకా మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని, రాజకీయపరంగా మరింత ఎత్తుకు ఎదగాలని, వ్యాపార పరంగా ఉన్నత స్థానంలో ఉండాలని, దస్తావేజు లేఖరుల సంక్షేమం కోసం ఆయన నిరంతరం పాటుపడాలని, దస్తావేజులేఖర్ల సమస్యలని తన సమస్యలుగా పరిగణించి ఎలాంటి పక్షపాత వైఖరి లేకుండా అందరికీ సమన్యాయం చేయాలని, కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎస్ ఎస్ సి మిత్ర బృందం ఎం. యాద గిరి, టి. రాఘవేంధర్, ఎం. శ్రీనివాస్, బి. రాములు, కే. అంజనేయులు, పి.ఉధయ్ కుమార్, ఎం. నర్సిములు, ఎస్ శ్రావణ్ కుమార్, ఏ రంజిత్ కుమార్, బి చెన్నయ్య, సి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకుడు శ్రీనివాస్ నాయక్ మరియు రవి నాయక్ పాల్గొన్నారు.

## ఇరాన్‌పై దాడి చేసినందుకు ట్రంప్‌ని అభినందించిన నెతన్యాహు



టెల్ అవీవ్ : ఇజ్రాయిల్ – ఇరాన్ ఘర్షణల్లో అమెరికా జోక్యం చేసుకుంది. తాజాగా శనివారం రాత్రి ఇరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడి చేసింది. ఇలా దాడి చేసినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అభినందించారు. 'అధ్యక్షుడు ట్రంప్‌కి నా అభినందనలు. ఇరాన్ అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకోవాలనే మీ సాహసోపేతమైన నిర్ణయం చరిత్రను మారుస్తుంది. ఆపరేషన్ రైజింగ్ లయన్‌లో.. ఇజ్రాయిల్ నిజంగా అద్భుతమైన పనులు చేసింది. కానీ శనివారం రాత్రి ఇరాన్ అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడితో అమెరికా నిజంగా గొప్ప పని చేసింది. ఏ ఇతర దేశం చేయలేని పని అమెరికా చేసింది' అని నెతన్యాహు వీడియో పోస్టులో ట్రమ్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన పాలనను, అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలను తిరస్కరించడానికి వ్యవహరించిన వ్యక్తిగా అమెరికా అధ్యక్షుడు చరిత్ర సృష్టించారని నెతన్యాహు అన్నారు. 'అధ్యక్షుడు ట్రంప్, నేను తరచుగా చెబుతాము. బలం ద్వారానే శాంతి వస్తుంది. మొదట బలం వస్తుంది. ఆ తర్వాత శాంతి వస్తుంది. శనివారం రాత్రి అమెరికా మొదట తన బలం చూపించింది. అమెరికా చర్యకు ట్రంప్‌కు నా కృతజ్ఞతలు' అని నెతన్యాహు వీడియో పోస్టులో తెలిపారు.

## వచ్చే నెల 3న నెల్లూరుకు వైఎస్ జగన్ వచ్చి తీరుతాడు..



**అమరావతి,:** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ రెడ్డి, తలశిల రఘురామ్, మేరుగ మురళి, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి, కాకాణి పూజిత ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే నెల 3వ తేదిన మాజీ సీఎం జగన్ నెల్లూరుకి వచ్చి.. జైలులో ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శిస్తారు అని వెల్లడించారు. ప్రభుత్వం మీద ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుంది.. అక్రమ కేసులు పెట్టడం సరికాదు అని హెచ్చరించారు. ఇక, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాకి వైఎస్ జగన్ వస్తున్నారని సమాచారం తెలిసినప్పుడల్లా.. ఏదో ఒక దొంగ కేసు పెడుతున్నారు అని మండిపడ్డారు. 3వ తేదీ పీటీ వారెంట్ వేసి బయటికి తీసుకెళ్లినా.. జగన్ మాత్రం జిల్లాకి రావడం ఖాయం అని తేల్చి చెప్పారు. అలాగే, కాకాణి కూతురు పూజిత మాట్లాడుతూ.. గోవర్ధన్ రెడ్డిని కలిసేందుకు ములాఖత్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదు అని ఆరోపించింది. వైఎస్ జగన్ వచ్చినప్పుడు నాన్న జైలులో లేకపోతే.. ఇంటికి వచ్చి మమల్ని పరామర్శిస్తారు.. ఇప్పుడు చేసిన ప్రతి పనికి భవిష్యత్తులో టీడీపీ నేతలు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది అని ఆమె వార్నింగ్ ఇచ్చింది.

## ఇంద్రకీలాద్రిపై వారాహి నవరాత్రులు..
## ఆషాడ సారె సమర్పణకు ఏర్పాట్లు!



**అమరావతి,:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయంలో జూన్ 26 నుంచి జూలై 4వ తారీకు వరకు 'వారాహి నవరాత్రులు' నిర్వహించనున్నారు. విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ఆషాడ మాస సారె సమర్పణ ఉత్సవాలు నిర్వహించనున్నారు. మహా మండపంలోని ఆరవంతస్తులో అమ్మవారి ఉత్సవం మూర్తిని ప్రతిష్టించి పూజాభిషేకాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఆషాడ సారె సమర్పణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లపై ఈవోతో ఆలయ వైదిక కమిటీ, అర్చకులు చర్చించారు. వారాహి అమ్మవారి నవరాత్రులు, ఆషాడం మాస సారె సమర్పణ ఏర్పాట్లపై ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఈవో శీనా నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. వైదిక కమిటీ సూచనల మేరకు హోమ గుండాలు, భక్తులు కూర్చునేందుకు తివాచీలు ఏర్పాటు తదితర అంశాలపై ఈవో శీనా నాయక్ అధికారులకు సూచనలు చేశారు. అలాగే వారాహి అమ్మవారి నవరాత్రుల గురించి ప్రచారం చేసి విజయవంతం చేయాలని పలు విభాగాలకు ఆదేశాలు ఇచ్చారు. జూన్ 26 నుంచి జూలై 24 వరకు ఆషాఢ మాసోత్సవాలు, జూన్ 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవ రాత్రులు, జూలై 8 నుంచి 10వ తేదీ వరకు శాకంబరీదేవి ఉత్సవాలు జరగనున్నాయి. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని.. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీ. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటకల నుంచి కూడా దుర్గమ్మకు భక్తులు సారె సమర్పిస్తారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని ప్రతిష్టించి పూజలు చేస్తారు. మూలవిరాట్ దర్శన అనంతరం ఉత్సవమూర్తికి సారెను సమర్పిస్తారు.ు

## కవిత బీసీ కాకున్నా పోరాటం చేస్తున్నారు అండగా నిలవాలి



**హైదరాబాద్, :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాకున్నా బీసీల కోసం పోరాడుతున్నారు..అని ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని ఆర్.కృష్ణయ్య నివాసంలో ఎమ్మెల్సీ కవిత ఆయన్ను కలిశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తాము చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాలని ఆమె కోరారు. ఈ నేపథ్యంలోనే జులై 17వ తేదీన నిర్వహించ తలపెట్టిన రైల్ రోకోకు మద్దతు ఇస్తున్నట్లు కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ.. బీసీల కోసం అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి లేదు. కవితకు బీసీలు అండగా నిలవాలి. బీసీలు పోరాటం చేసే చారిత్రక సందర్భం వచ్చింది. బీసీలకు 75 ఏళ్లుగా అన్యాయం జరుగుతోంది. బీసీలు కమిట్మెంట్‌తో పోరాటం చేయకపోతే ఇప్పుడు ఉన్న బీసీ రిజర్వేషన్లు తగ్గుతాయి. కవిత బీసీ కాకపోయినా బీసీల కోసం పోరాడుతున్నారు. ప్రజా ఉద్యమం చేయకపోతే బీసీల హక్కులు నెరవేరవు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కోసం ఎవరు ఉద్యమం చేసినా బీసీలు మద్దతు ఇవ్వాలి. ప్రభుత్వం పులి మీద స్వారీ చేస్తుంది. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం చూస్తోంది. బీసీల రిజర్వేషన్లు కోసం పోరాటం చేసే వారిని ఎవరూ తప్పుపట్టవద్దు. బీసీలు ఉద్యమం చేస్తేనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వస్తాయి. జూలై 17న జరిగే జాగృతి రైల్ రోకోకు కచ్చితంగా మద్దతు ఇస్తాం. కవిత ఎవరి కోసం పోరాటం చేస్తుంది... బీసీల కోసమే కదా.?..అని ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు.

# యుద్ధం.. దేశాధినేతల వైఫల్యాలకు అద్దం




యుద్ధాలు ఆగాలి, మనుషులు గెలవాలి, ప్రతి మరణం వెనుక ఒక కుటుంబం ఉంటుందన్న జ్ఞానం మన నేతలకు తెలియదా? యుద్ధోన్మాదం ఎన్నో ఆశలను ఆశయాలను చిదిమేస్తున్నా, యుద్ధం పరిష్కరించిన సమస్య లేదని తెలిసినా నిత్యం రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు దేశాధినేతలు. యుద్ధం ప్రభావాలు విస్తృతంగా వ్యాపించి ఉంటాయి, దీర్ఘకాలికంగా లేదా స్వల్పకాలికంగా ఉండవచ్చు. సైనికులు యుద్ధాన్ని పౌరుల కంటే భిన్నంగా అనుభవిస్తారు. యుద్ధ సమయాల్లో ఇద్దరూ బాధపడుతున్నప్పటికీ, ముఖ్యంగా మహిళలు, పిల్లలు దారుణాలకు గురవుతున్నారు.గత దశాబ్దంలో సాయుధ పోరాటాలలో మరణించిన వారిలో రెండు మిలియన్ల మంది వరకు పిల్లలే. యుద్ధాలు విస్తృతమైన భావోద్వేగ మానసిక ఒత్తిడిని సృష్టిస్తాయి. ప్రతి ప్రాణం వెనుక ఒక తల్లి ప్రసవ వేదన ఉంది. జూన్ 2025లో ఇరానియన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు, ఇరాన్ ప్రతీకార క్షిపణి దాడులతో తీవ్రతరం అయిన ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం వినాశనానికి దారితీసింది. ఇరాన్‌లో 263 మంది పౌరులు, ఇజ్రాయెల్‌లో 24 మందితోసహా 657 మందికిపైగా మరణించారు. వేలాదిమంది గాయపడ్డారు, స్థానభ్రంశం చెందారు. జి7 శిఖరాగ్ర సమావేశంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సహా శాంతి కోసం ప్రపంచవ్యాప్తంగా పిలుపునిచ్చినప్పటికీ సంఘర్షణ కొనసాగుతోంది. ఇరాన్- ఇజ్రాయెల్ వివాదం స్పష్టమైన కేస్ స్టడీగా ఉండటంతో, లోతైన అపనమ్మకం, సంకుచిత ప్రయోజనాలు, దేశీయ రాజకీయాలు, వ్యవస్థాగత వైఫల్యాలలో సమాధానం ఉంది. ఇజ్రాయెల్, ఇరాన్ అణు ఆశయాలను అస్తిత్వముప్పుగా భావిస్తోంది, నటాంజ్, ఫోర్డోలను లక్ష్యంగా చేసుకున్న 'ఆపరేషన్ రైజింగ్ లయన్' వంటి ముందస్తు దాడులను సమర్థిస్తోంది. ప్రతిగా ఇరాన్ ఈ దాడులను సార్వభౌమాధికార ఉల్లంఘనలుగా భావిస్తోంది. టెల్ అవీవ్, హైఫా వంటి ఇజ్రాయెల్ నగరాలపై క్షిపణి దాడులను ప్రేరేపించింది. ఇరాన్ అణుబాంబును నిర్మిస్తున్నట్లు యుఎస్ నిఘా వర్గాలకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. అయినప్పటికీ హిజ్బుల్లా వంటి ప్రాక్సీలకు ఇరాన్ మద్దతు ఇవ్వడం ద్వారా ఇజ్రాయెల్ భయాలు తీవ్రతను పెంచాయి. దశాబ్దాల శత్రుత్వంలో పాతుకుపోయిన ఈ పరస్పర చర్య రెండు వైపులా దౌత్యంపై సందేహాస్పదంగా ఉంది. ఎందుకంటే ప్రతి ఒక్కరూ రాయితీలను బలహీనతగా భావిస్తారు. కఠినమైన దేశీయవర్గాలు తరచుగా రాజకీయ లాభం కోసం యుద్ధాన్ని కొనసాగిస్తాయి. ఇజ్రాయెల్‌లో అవినీతి ఆరోపణలు, గాజాపై విమర్శలను ఎదుర్కొంటున్న ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు సంకీర్ణం, యుద్ధం ద్వారా ప్రజల మద్దతును కూడగట్టింది, దేశాన్ని ఏకంచేసింది. ఇరాన్‌లో కమాండర్ హొసేన్ సలామి వంటి నాయకుల హత్య జాతీయవాదులను, పాలన విమర్శకులను కూడా సార్వభౌమాధికారం చుట్టూ తిప్పింది. ఇజ్రాయెల్ దాడులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ఇవ్వడం, శిఖరాగ్ర సమావేశం నుంచి ముందస్తుగా నిష్క్రమించడంతోపాటు, సమష్టి దౌత్యానికి పరిమిత నిబద్ధతను సూచించింది. యూరోపియన్ నాయకులు గల్ఫ్ మధ్యవర్తుల ద్వారా అణు చర్చలకోసం ఒత్తిడి చేశారు. కానీ అమెరికా పరపతి లేకుండా, వారి ప్రయత్నాలు విఫలమవుతాయి. ఇరాన్‌తో జతకట్టిన రష్యా, చైనా బలమైన జోక్యం కంటే తమ సొంత ప్రయోజనాలకు రష్యాకు ఉక్రెయిన్, చైనాకు చమురు ప్రాధాన్యత ఇస్తారు. ప్రధాన శక్తులు పొత్తులు వ్యూహాత్మక లక్ష్యాలను సమతుల్యం చేస్తున్నందున ఈ విచ్ఛిన్నం ఏకీకృత చర్యను బలహీనపరుస్తుంది.శాంతి ప్రోత్సాహకాల కంటే ఆర్థిక వ్యూహాత్మక ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నప్పుడు యుద్ధాలు కొనసాగుతాయి. హార్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ, దాని ఇంధన మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్ దాడులు చమురు ధరలను పెంచాయి. ప్రపంచ మార్కెట్లను బెదిరించాయి. ఇజ్రాయెల్‌తో ఇరాన్ వ్యతిరేక అక్షంలో భాగమైన సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలు వివాదం విస్తృతమైతే ప్రతీకార చర్యలను ఎదుర్కొంటాయి. ప్రధాని మోడీ నేతృత్వంలోని భారతదేశం ఈ సమతుల్య చర్యకు ఉదాహరణగా నిలుస్తుంది. చాబహార్ నౌకాశ్రయం ద్వారా ఇరాన్‌తో ఆర్థిక సంబంధాలను కాపాడుకుంటుంది. మోడీ తటస్థ వైఖరి -యుఎన్ / ఎస్‌సిఒ అమరికలను తప్పించుకుంటూ సంభాషణను కోరడం భారతదేశ ప్రయోజనాలను కాపాడటానికి లెక్కించిన ప్రయత్నాన్ని ప్రతిబింబిస్తుంది. కానీ అది ధైర్యమైన మధ్యవర్తిత్వాన్ని పరిమితం చేస్తుంది. దేశాలు స్వార్థానికి ప్రాధాన్యత ఇస్తాయి, యుద్ధాన్ని ఆపడానికి సమష్టి సంకల్పాన్ని తగ్గిస్తాయి. అంతర్జాతీయ సంస్థల వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ యంత్రాంగాలు తరచుగా శాంతిని అమలు చేయడంలో విఫలమవుతున్నాయి. వీటోల ద్వారా అడ్డుకోబడిన ఐక్యరాజ్య భద్రతా మండలి, బైండింగ్ తీర్మానాలను ఆమోదించడానికి కష్టపడుతుండగా, అణుప్రదేశాలపై దాడులను ఐఎఇఎ ఖండించడం అమలులో లేదు. ఇరాన్‌ను ఖండిస్తూనే ఇజ్రాయెల్ ఆత్మరక్షణకు మద్దతు ఇవ్వడం – జి7 ప్రతిస్పందన దాని తటస్థత, క్షీణింపజేసే పక్షపాతాన్ని వెల్లడిస్తుంది. ఇరాన్‌లోని ఫరాబి హాస్పిటల్ ఇజ్రాయెల్‌లోని సోరోకా మెడికల్ సెంటర్‌పై దాడులు వంటి అంతర్జాతీయ చట్ట ఉల్లంఘనలు అదుపు లేకుండా పోతాయి. నిబంధనలు దెబ్బతీస్తాయి. పౌర రక్షణ పట్ల రెండు వైపులా నిర్లక్ష్యంగా కనిపిస్తుంది. మానవ స్వభావం సైద్ధాంతిక విభజనలో భాగంలో, యుద్ధం మానవ ధోరణి కారణంగా కొనసాగుతుంది. దేశాధినేతలు సోషల్ మీడియా ధ్రువీకరించబడిన అభిప్రాయాలను ప్రతిబింబిస్తుంది. కొందరు ఇజ్రాయెల్ దాడులు వీరోచితంగా ప్రశంసించారు, మరికొందరు వాటిని ఖండించారు. ప్రచారం ద్వారా విస్తరించబడిన ఈ సరిదిద్దలేని భావజాలాలు రాజీని దూరం చేస్తాయి. ఇరానియన్లు, ఇజ్రాయెలీయుల కోసం ప్రతిపాదించబడిన సాంస్కృతిక మార్పిడులు, ప్రత్యర్థులను మానవీకరించగలవు. కానీ పాతుకుపోయిన ద్వేషాలు అలాంటి ప్రయత్నాలను అడ్డుకుంటాయి. యుద్ధాన్ని ఆపడానికి ఈ అడ్డంకులను అత్యవసర, బహుముఖ చర్యల ద్వారా అధిగమించాలి. నిజమైన నిబద్ధతతో కూడిన శిఖరాగ్ర సమావేశాలు ఫలవంతమైన పరిష్కారం చూపగలవు. చర్చలు విశ్వాసాన్ని పెంచుతాయి. ఐక్యరాజ్యసమితి లేదా ఖతార్ నేతృత్వంలోని శిఖరాగ్ర సమావేశం పునరుద్ధరించగలదు. తక్షణమే మానవాళికోసం రెండు దేశాలు యుద్ధాన్ని ఆపాలి.

# ఆటిజంపై జన్యువుల ప్రభావం



ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అనేది మెదడు అభివృద్ధిలో తేడాల వల్ల కలిగే ఒక రుగ్మత. దీనిని సాధారణంగా మందబుద్ధి అని అంటారు. ఈ రుగ్మత ఉన్న వ్యక్తులు తోటివారితో కలసిమెలసి ఉండకుండా ఒంటరిగా ఉంటుంటారు. తల్లి కడుపులో బిడ్డ ఉన్నప్పటి దశలోనే ఈ ఆటిజం లక్షణాలు సంక్రమిస్తుంటాయి. శిశువు మెదడులో నాడీ కణాల ఉత్పత్తి, వీటి మధ్య సమాచార ప్రసారంలో లోపాలు ఆటిజంకు కారణమవుతున్నాయి. ఆటిజం బారిన పడినవారు సామాజిక సంబంధాలు, ప్రవర్తన, కమ్యూనికేషన్‌లో సమస్యలను ఎదుర్కొంటుంటారు. సామాజిక సూచనలను అర్థం చేసుకోలేరు. ఒకే పనిని పదేపదే చేయడం, కొన్ని వస్తువుల పైనే ఎక్కువ ఆసక్తి చూపడం, కదలికల్లో ఇబ్బంది ఇవన్నీ ఆటిజం లక్షణాలు. శబ్దాలు, వెలుతురు, తాకిడికి భరించలేని సున్నితత్వం. మాట్లాడడం, నడవడం లేదా ఇతర ముఖ్యమైన నైపుణ్యాలు నేర్చుకోవడంలో ఆలస్యం చేస్తుంటారు. ఇటీవల పరిశోధనలో జన్యుపరమైన అంశాలు, పర్యావరణ అంశాలు సంయుక్తంగా ఆటిజంపై ప్రభావం చూపిస్తుంటాయని వెల్లడైంది. ఈ లక్షణాలకు మూలకారణమైన జన్యువులు ఏమిటో తెలుసుకోడానికి పరిశోధనలు చేపట్టగా వాయు కాలుష్యం వంటి పర్యావరణ అంశాలు, తల్లి ఆరోగ్యం ఇవన్నీ జన్యువులతో అనుసంధానమవుతాయని తేలింది. ఆటిస్టిక్ లక్షణాలున్న వారికి, ఆ లక్షణాలు లేనివారికి మెదడు అభివృద్ధిలో తేడాలు కనిపిస్తున్నట్టు పరిశోధకులు తెలుసుకున్నారు. కొన్ని అధ్యయనాలు ఆటిజం బాధితుల్లో మెదడు విపరీతంగా పెరగడం, కార్టికల్ వ్యత్యాసాలను కనుగొన్నాయి. కార్టికల్ వ్యత్యాసాలు అంటే పట్టకట్టు వ్యత్యాసాలు లేదా వల్కల వ్యత్యాసాలు అని చెప్పవచ్చు. ఇది మెదడు బయటిపొర (కార్టెక్స్)లోని నిర్మాణంలో లేదా మందంలో ఉండే తేడాలను సూచిస్తుంది. ఈ వ్యత్యాసాలు, ప్రవర్తన, అభిజ్ఞ సామర్థ్యాలలో తేడాలకు దారితీస్తుంది. కొత్త జన్యువులు, జన్యువుల్లో భేదాలు, అరుదైన ఉత్పరివర్తనాలు, సాధారణ మార్పులు ఆటిజం లక్షణాలతో అనుసంధానమవుతాయని పరిశోధకులు గుర్తించారు. అలాగే నిర్దిష్టమైన ప్రొటీన్లు ఆటిజంతో కలిసి మెదడులోని ఇతర మాలిక్యూల్స్‌తో అనుసంధానమవుతాయని తెలుసుకున్నారు. ఉదాహరణకు జన్యుమార్పు వల్ల సంక్రమించే మైయోటోనిక్ డిస్ట్రోఫీ (డిఎం1)కూడా మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపించి ఆటిజం వంటి లక్షణాలకు దారితీస్తుంది. మయోటోనిక్ డిస్ట్రోఫీ అంటే వారసత్వంగా వచ్చే రుగ్మత. ఇది కండరాల క్షీణత, బలహీనతకు కారణమవుతుంది. దీనినే కండరాల క్షీణత వ్యాధి అని అంటారు. ఆటిజంపై వాయు కాలుష్యం వంటి పర్యావరణ ప్రభావాలపై, గర్భస్రావ సమయంలో తల్లి ఆరోగ్యం ప్రభావంపై కూడా పరిశోధనలు జరిగాయి. దీనివల్ల ఆటిజం రిస్కు ఎక్కువవుతుందని తేలింది. గర్భిణిపై అత్యధిక స్థాయిల వాయు కాలుష్యం ప్రభావం చూపిస్తుందని తేలింది. ముఖ్యంగా మూడో నెల గర్భిణిపై వాయుకాలుష్య ప్రభావం తీవ్రంగా ఉంటే పుట్టిన బిడ్డకు ఆ తరువాత ఆటిజం లక్షణాలు బయటపడతాయని పరిశోధకులు చెబుతున్నారు. ఆటిజం ఉన్న వ్యక్తుల్లో మెదడు అభివృద్ధిలో కార్టికల్ దళసరి, విపరీతంగా పెరగడం, మెదడు నెట్‌వర్క్‌లో తేడాలు కనిపించాయి. ఆటిజం లేని వారితో పోలిస్తే ఆటిజం ఉన్న బాలికల్లో మూడేళ్ల వయసులో మెదడులోని కార్టెక్స్ చాలా దళసరిగా ఉండడం కనిపించింది. ఆటిజం ఉన్న మహిళల్లో వారి బాల్యంలోనే కార్టికల్ సన్నబడడం వేగంగా ఉంటోందని పరిశోధకులు గుర్తించారు. శస్త్ర చికిత్సల అవసరం లేకుండా మెదడును చైతన్యపర్చడం, ప్రెజర్ చాంబర్ థెరపీ అంటే హైపర్‌బారిక్ ఆక్సిజన్ థెరపీ (శుద్ధియైన ఆక్సిజన్‌ను ఒత్తిడిగదిలో పీలుస్తుండడంతో రక్తంలో ఆక్సిజన్ శాతాన్ని పెంపొందించడం) వంటి నూతన చికిత్సలను, ఆవిష్కరణ పద్ధతులను పరిశోధకులు ఇప్పుడు ముందుకు తెస్తున్నారు. బిడ్డ దశలోనే ఆటిజం లక్షణాలను కనుగొనడానికి ఎం చాట్ ఆర్/ఎఫ్ వంటి సమర్థవంతమైన స్క్రీనింగ్ పరికరాలను అధ్యయనంలో ప్రవేశపెట్టారు. ఆటిజం పెరగడానికి జన్యువులు, పర్యావరణ అంశాల మధ్య సమస్యలతో కూడిన పరస్పర చర్యలు ముడిపడి ఉన్నాయని పరిశోధన వెల్లడించింది. ఆటిజం పూర్తిగా నయమయ్యేది కాకపోయినా, తగిన సమయంలో చికిత్స అందిస్తే ఆటిజం పిల్లలు మామూలుగా ఎదిగే అవకాశం కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 42 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం సంక్రమిస్తోందని సర్వేలు చెబుతుండగా మన దేశంలో ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు దీని బారినపడుతున్నారని ఇండియన్ జర్నల్ ఆఫ్ పీడియాట్రిక్స్ పత్రికలో అధ్యయనం వెలువడింది. ఆటిజం ఎందుకు వస్తుందో ఏయే అంశాలు దోహదం చేస్తున్నాయో ప్రపంచ వ్యాప్తంగా అధ్యయనాలు సాగుతున్నాయి. పుట్టిన తర్వాత రెండేళ్ల వయసులో పాత నాడీ కణాలకు బదులుగా కొత్త కణాలు వచ్చి చేరేటప్పుడు క్రమపద్ధతి లేకపోవడం కూడా కారణం కావచ్చునని భావిస్తున్నారు. అయితే ఆటిజంలో జన్య, పర్యావరణ అంశాల ప్రభావమే ఎక్కువ అని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. 700 కంటే ఎక్కువ జన్యువులు ఆటిజంతో సంబంధం కలిగి ఉన్నాయి. క్రోమోజోమల్ మైక్రోఅరే, తర్వాతి తరం సీక్వెన్సింగ్ వంటి జన్యు పరీక్షలను ఉపయోగించి జన్యుపరమైన కారణాలను నిర్ధారించవచ్చు. ఇది ప్రారంభ చికిత్సలోనే వ్యాధి భవిష్యత్‌ను అంచనా వేయడంలో సాయపడుతుంది. ఆటిజం జన్యుపరమైన కారణాలను నిర్ధారించడానికి ప్రస్తుతం ఎన్నో పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అబ్బాయిలకి ఫ్రెగైల్ అండ్ టెస్టింగ్ సిఫార్సు చేస్తుంటారు. కొంతమంది అమ్మాయిల్లో ఎంఇసిపి2 జన్యువుల్లో మార్పులను ఆ జన్యు పరీక్ష గుర్తించ గలుగుతుంది. ఆటిజంకు కారణమయ్యే జన్యువులను తొలగించడం, నకిలీలను గుర్తించడం వంటి చర్యలను క్రొమోజోమల్ మైక్రోఅరే పరీక్షలు చేపడతాయి. పసిపిల్లల్లో ఆటిజంను ముందుగా గుర్తించడానికి ఎంచాట్, త్రివేండ్రం ఆటిజం బిహేవియరల్ చెక్‌లిస్ట్ (టిఎబిసి), సోషల్ కమ్యూనికేషన్ క్వశ్చనేర్ వంటి స్క్రీనింగ్ సాధనాలను వాడవచ్చు. డిఎస్ఎం 5 వంటి మార్గదర్శకాలు, ఆటిజం డయాగ్రోస్టిక్ అబ్జర్వేషన్ షెడ్యూల్, ఇండియన్ స్కేల్ ఫర్ ది అసెస్‌మెంట్ ఆఫ్ ఆటిజం వంటి సాధనాలు ఆటిజం సమస్యను గుర్తించడానికి ఉపయోగపడతాయి.

# జి7 సదస్సులో భారత్ కీలక ప్రతిపాదనలు



కెనడాలోని కనానస్కిస్‌లో 2025 జూన్ 18 -19 తేదీలలో జరిగిన 51వ జి-7 సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఔట్‌రీచ్ సెషన్‌లో పాల్గొని, ఉగ్రవాదం, ఇంధన భద్రత, కృత్రిమ మేధస్సు (ఎఐ), గ్లోబల్ సౌత్ ఆకాంక్షలపై కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశం ప్రపంచ శాంతి, స్థిరమైన అభివృద్ధి కోసం సమష్టి చర్యల అవసరాన్ని నొక్కి చెప్పింది. మోడీ ప్రసంగం భారత్‌ను గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా నిలబెట్టడమే కాక, ఉగ్రవాద నిర్మూలన, స్థిరమైన ఇంధన విధానాలపై దృఢమైన సందేశాన్ని అందించింది. ఈ సమ్మిట్‌లో చర్చించిన అంశాలు, భారత్ ప్రతిపాదనలు, ఇతర దేశాల స్పందనలు ప్రపంచ రాజకీయ, ఆర్థిక డైనమిక్స్‌ను అర్థం చేసుకోవడానికి కీలకమైనవి. జి-7 సదస్సులో ఉగ్రవాదం ప్రధాన అంశంగా నిలిచింది. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ మోడీ దీనిని మానవత్వంపై దాడిగా అభివర్ణించారు. 'ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరి ఉండకూడదు. దీనిని సమర్థించే దేశాలు తగిన మూల్యం చెల్లించాలి' అని ఆయన హెచ్చరించారు. పాకిస్తాన్‌ను పరోక్షంగా ఉగ్రవాద కేంద్రంగా ఆరోపిస్తూ, దాని వత్తాసుతోనే పహల్గాం దాడి జరిగిందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాద నిర్మూలనకు అంతర్జాతీయ సమన్వయం, ఆర్థిక ఆంక్షలు, సమాచార భాగస్వామ్యం అవసరమని సూచించారు. ఈ వ్యాఖ్యలు పాకిస్తాన్‌పై ఒత్తిడి తీసుకురావడంతో పాటు, భారత్ జాతీయ భద్రతా విధానాన్ని ప్రపంచ వేదికపై స్పష్టం చేశాయి. ఇంధన భద్రత మరో కీలక చర్చా అంశం. మోడీ స్థిరమైన, సరసమైన ఇంధన వనరుల అవసరాన్ని నొక్కి చెప్పారు. గ్లోబల్ సౌత్ దేశాలు ఇంధన అనిశ్చితులను ఎదుర్కొంటున్నాయని, సౌర, పవనశక్తి వంటి పునరుత్పాదక వనరులపై పెట్టుబడులు పెంచాలని సూచించారు. భారత్‌లో సౌరశక్తి, గ్రీన్‌హైడ్రోజన్ వంటి చొరవలను హైలైట్ చేస్తూ, అంతర్జాతీయ సహకారం కోసం పిలుపునిచ్చారు. ఎఐ సాంకేతికత శక్తివంతమైనది అయినప్పటికీ, దాని అధిక ఇంధన వినియోగం సవాలని, దీనికి పరిష్కారంగా గ్రీన్ డేటా సెంటర్ల అభివృద్ధిని ప్రతిపాదించారు.ఈ సూచనలు భవిష్యత్-కేంద్రిత దృష్టిని, భారత్ పర్యావరణ నిబద్ధతను ప్రతిబింబించాయి. గ్లోబల్ సౌత్ దేశాల ఆకాంక్షలను మోడీ బలంగా వినిపించారు. ఆర్థిక అసమానతలు, సాంకేతిక వెనుకబాటుతనం, ఇంధన అవసరాలు వంటి సమస్యలను లేవనెత్తి, ఈ దేశాలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఎఐ ఆవిష్కరణలలో సమన్యాయం, సాంకేతిక బదిలీ ద్వారా గ్లోబల్ సౌత్ దేశాల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఈ ప్రతిపాదనలు భారత్‌ను అభివృద్ధి చెందుతున్న దేశాల స్వరంగా నిలబెట్టాయి. జి-7 దేశాల నాయకుల స్పందన సానుకూలంగా ఉంది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ మోడీని ఆహ్వానించడం వెనుక భారత్ పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని గుర్తించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన ద్వైపాక్షిక చర్చలలో పహల్గాం దాడికి ప్రతిగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు ఉగ్రవాద నిర్మూలనకు ఐక్యత అవసరమని సమర్థించాయి. అయితే ఆంక్షల విధానంపై ఏకాభిప్రాయం సాధించడం సవాలుగా కనిపిస్తోంది. ఇంధన భద్రత, ఎఐపై భారత్ సూచనలు గ్లోబల్ సౌత్ దేశాల నుండి విశేష ఆదరణ పొందాయి. జి -7 దేశాలు సహకారం కోసం ముందడుగు వేసే సూచనలు కనిపించాయి. విశ్లేషణాత్మకంగా చూస్తే మోడీ జి-7 సమ్మిట్‌లో భారత్ జాతీయ ప్రయోజనాలను, గ్లోబల్ సౌత్ ఆకాంక్షలను సమతుల్యం చేసే ప్రయత్నం చేశారు. ఉగ్రవాదంపై దృఢమైన వైఖరి, పాకిస్తాన్‌పై విమర్శలు అంతర్జాతీయ సంఘంలో భారత్ గళాన్ని బలోపేతం చేశాయి. ఇంధన భద్రత, ఎఐపై సూచనలు భవిష్యత్ -కేంద్రిత దృష్టిని సూచిస్తాయి. అయితే, ఈ ప్రతిపాదనల అమలుకు అంతర్జాతీయ సమన్వయం, రాజకీయ సంకల్పం అవసరం. జి-7 దేశాల సానుకూల స్పందన ఉన్నప్పటికీ ఆంక్షలు, సాంకేతిక బదిలీ వంటి విషయాలలో ఏకాభిప్రాయం సాధించడం సవాలుగా ఉంది. ఈ సమ్మిట్ భారత్ గ్లోబల్ లీడర్‌షిప్‌ను బలపరిచింది. ఉగ్రవాద నిర్మూలన, స్థిరమైన ఇంధనం, ఎఐ అభివృద్ధిలో భారత్ చూపిన చొరవలు ప్రపంచ శాంతి, అభివృద్ధికి దోహదపడతాయి. గ్లోబల్ సౌత్ దేశాల స్వరంగా, భారత్ ప్రతిపాదనలు సమతుల్య ప్రపంచీకరణకు మార్గం సుగమం చేస్తాయి. ఈ సమ్మిట్ ఫలితాలు భవిష్యత్ అంతర్జాతీయ సహకారానికి దిశానిర్దేశం చేస్తాయని ఆశిద్దాం.

## అప్పట్లో హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు.. మోడీ వచ్చాక ఉగ్రవాదుల జాడేలేదు..?



**హైదరాబాద్, :** ఏడాదిగా మల్కాజ్గిరి పార్లమెంట్‌లో ఈటెల రాజేందర్ చేసిన అభివృద్ధిని వివరించడానికి ఈ సభ ఏర్పాటు చేశారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. 11 ఏళ్లుగా మోడీ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. 11 ఏళ్లు పరిపాలన చేయడానికి ప్రజలు ఆమోదం తెలిపిన ప్రభుత్వం మోడీ ప్రభుత్వమని కొనియాడారు. మరో 11 ఏళ్లు మోడీ పరిపాలన ప్రజలు కోరుకుంటున్నారని.. యూపీఏ ప్రభుత్వంలో ఏ వార్త చూసినా కుంభకోణాలు, అవినీతి పై వార్తలు వచ్చేవన్నారు. అందుకే 2014 లో దేశ ప్రజలు అవినీతి ప్రభుత్వం కాదని, మోడీని ప్రధాని గా చేశారని తెలిపారు. ఏ ఒక్క రోజు కూడా నరేంద్ర మోడీ ప్రభుత్వంపై అవినీతి జరిగినట్లు వార్తలు రాలేదని చెప్పారు.. అప్పట్లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం ఉండేదని.. అప్పుడు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉండేదని విమర్శించారు.. ఇప్పుడు అద్భుతమైన పరిపాలన ప్రజలు చూస్తున్నారన్నారు. అభివృద్ధి లో దేశం ఎలా ముందుకు వెళ్ళాలో ప్రపంచానికి తెలిసేలా మోడీ ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.. అప్పుడు పాకిస్థాన్ ఆడిందే ఆటగా ఐఎస్ఐ ఏజెంట్ల ద్వారా దేశాన్ని అంతలాకుతలం చేసిందని.. అప్పుడు లుంబినీ పార్క్, గోకుల్ చాట్, దిల్సుక్‌నగర్‌లో బాంబు పేలుళు జరిగాయని గుర్తు చేశారు. ఇప్పుడు ఎక్కడా కూడా ఉగ్రవాద చర్యలకు తావు లేకుండా మోడీ ప్రభుత్వం చేసిందని తెలిపారు. అప్పుడు ఉగ్రవాద దాడి జరిగితే పోలీసులు కూడా ఏమి చేయలేని పరిస్థితి ఉండేదని.. కానీ, మోడీ ప్రభుత్వంలో ఉగ్రవాద దాడికి సర్జికల్ స్ట్రైక్ జరిగిందని చెప్పారు.. మొన్న కూడా ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రధాని మోడీ మన సత్తా ఏంటో ప్రపంచానికి చూపించారని కొనియాడారు. అమెరికాను తలతన్నే విధంగా మన దేశంలో రోడ్లు నిర్మించారని.. జాతీయ రహదారులను అనుసంధానం చేసిన ఘనత మోడీ ప్రభుత్వానికి సొంతమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఒక్క రైల్వే స్టేషన్ డెవలప్ కాలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు." కానీ మోడీ మాన రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేశారు.. విద్యుత్ లేకుండా ఏ గ్రామం కూడా ఉండొద్దని మోడీ తలచుకుని.. మారుమూల ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా అందించారు. కొంత మంది రాజకీయ పార్టీలు ఆయనపై ఆరోపణలు చేస్తున్నారు.. అప్పుడు ప్రపంచ స్థాయిలో అధినేతల మీటింగ్ జరిగితే మన ప్రధాని ఎక్కడున్నాడని వెతుక్కునే పరిస్థితి ఉండేది.. కానీ ఇప్పుడు మోడీ ప్రధాని అయ్యాక ముందు వరసలో మన ప్రధాని కనిపిస్తున్నారు.. గతంలో ఏదైనా దాడి జరిగితే.. క్యాండిల్ లైట్లతో ర్యాలీ తీసేవాళ్ళం.. కానీ ఇప్పుడు హైదరాబాద్ లో తయారైన బ్రహ్మోస్ తో ఎదురు దాడి చేస్తామని పాకిస్థాన్‌కి తెలియజేశాం.. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ ఒక కుటుంబానికి బలి అయ్యింది.. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పుల పాలు చేసింది కేసీఆర్ కుటుంబం.. ఒక నియంత పాలనతో రాష్ట్రాన్ని వెనుకకు నెట్టారు.. ప్రజలు విసుగు చెంది మార్పు కోరుకున్నారు.. కేసీఆర్ ను గద్దె దించాలని నిర్ణయించుకున్నారు.. కానీ., రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన చేతకాని హామీలతో మరోసారి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ కి అధికారం ఇచ్చారు.. రైతులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు, మహిళకు అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారం చేపట్టింది కాంగ్రెస్.. ఇపుడు అధికారం చేపట్టాక ఏమీ చేయలేక పోతున్నా అంటున్నారు రేవంత్ రెడ్డి.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తీరాలంటే అది బీజేపీ తోనే సాధ్యం.. రాష్ట్ర అప్పులను తీర్చి.. ప్రజలకి అభివృద్ధి అందించాలి అన్నా బీజేపీ తోనే సాధ్యం.. తెలంగాణ ఆకాంశ తీరాలాంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అధికారాన్ని అందించాలని కోరుతున్నాను.." అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజలకు సేవ చేస్తున్న ఈటెల రాజేందర్‌ను అభినందిస్తున్నట్టు తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై బాంబు పేల్చిన టీపీసీసీ చీఫ్




**హైదరాబాద్, :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ శుక్రవారం ఒక సంచలన ప్రకటన చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీకి నేర చరిత్ర ఉందని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, పారిశ్రామికవేత్తలు, జడ్జీలు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సహా మొత్తం 650 మంది ఫోన్‌లు ట్యాప్ చేసిన చారిత్రక దౌర్భాగ్యానికి బీఆర్ఎస్ పార్టీ పాల్పడిందని పేర్కొన్నారు. మా లాంటి నాయకుల ఫోన్‌లతో పాటు, రాష్ట్రంలోని పలువురు ప్రముఖుల ఫోన్‌లు ట్యాప్ చేశారని ఆయన మండిపడ్డారు. ఇది దేశ చరిత్రలోనే అతి పెద్ద నేరమని, ఈ వ్యవహారంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరూ జైలుకు వెళ్లడం ఖాయమని ఆయన హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్‌ల ప్రమేయంతోనే ఈ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తమ అనుమానం అని స్పష్టం చేశారు. ట్యాప్ అయిన వారందరూ స్వచ్ఛందంగా విచారణకు హాజరుకావాలని మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. "సిట్‌ను మేము కోరుతున్నాం. ట్యాప్ అయిన 650 మంది పేర్లను బహిర్గతం చేయాలి. ప్రభుత్వ విధానాలే ప్రశ్నార్థకంగా మారాయి," అని అన్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆయన మరోసారి విమర్శలు చేశారు. "కాళేశ్వరం పేరుతో కోట్లు నదుల్లో కలిపారు. నాసిరకం పనులతో ప్రజాధనాన్ని వృథా చేశారు," అని ఆరోపించారు. బనకచర్ల విషయంలో కాంగ్రెస్ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా ఇంకా ప్రభుత్వ నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. "మంత్రివర్గంలో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటాం," అని తెలిపారు.

## శ్రీశైలం జలాశయానికి పోటెత్తిన వరద



**హైదరాబాద్, :** గత 20 రోజులుగా మహారాష్ట్రలో విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో నదుల్లో భారీ వరద ఉధృతి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో జూరాల ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. పూర్తి వర్షాకాలం రాకముందే ఈ సీజన్‌లో రెండోసారి జూరాల డ్యామ్ గేట్లను అధికారులు ఎత్తి వరద నీటిని విడుదల చేశారు. ఈ వరద నీరు నేరుగా కృష్ణా నదిలోకి చేరి శ్రీశైలం జలాశయాన్ని చేరుతోంది. ఇప్పటికే గత వానకాలంలో వచ్చిన వరదలతో శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా పెరిగాయి. తాజాగా మరోసారి జూరాల నుంచి భారీగా ఇన్‌ఫ్లో రావడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు పరుగులు తీస్తోంది. అధికారులు పేర్కొన్న ప్రకారం, ప్రస్తుతం జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి 60,587 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అయితే, శ్రీశైలంలో ప్రస్తుతం ఔట్‌ఫ్లో లేదు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది 854.20 అడుగులకు చేరుకుంది. అలాగే పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.7080 టీఎంసీలుగా ఉండగా, ప్రస్తుతం అందులో 89.7132 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తిని అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

# జంట భూకంపాలా? అణుపరీక్షలా?



ఇజ్రాయెల్ విశ్రాంతి లేకుండా విరుచుకుపడుతుంటే ఇరాన్ ఓవైపు ప్రతిదాడి చేస్తూనే మరోవైపు అణుపరీక్షలు జరిపిందన్న వార్తలు ఒక్కసారిగా సంచలనం సృష్టించాయి. అయితే ఈ వార్తల్లో నిజమెంత? అనే ప్రశ్న వెంటనే తలెత్తింది. ఈ వార్తల్లో వాస్తవముందని వాదించే వాళ్లు రెండు అంశాలను తెరమీదకు తెచ్చారు. ఈ వారం మొదట్లో ఇరాన్‌లో రిక్టర్ స్కేల్‌పై 2.5 తీవ్రతతో ఒకసారి భూకంపం వచ్చింది. తాజాగా శుక్రవారం 5.1 తీవ్రతతో మరోసారి భూకంపం సంభవించింది. భీకరపోరు చేస్తున్న దేశంలో వెంటవెంటనే భూకంపాలు రావడం, అదికూడా అంతరిక్ష కేంద్రం, క్షిపణి ఉత్పత్తి కర్మాగారాలు ఉన్న సెమ్నాన్ ప్రావిన్సులోనే సంభవించడంతో ఈ అనుమానాలు బలపడుతున్నాయి. ఓవైపు అణుబాంబును తయారుచేసే స్థాయికి యురేనియంను ఇరాన్ ఇంకా శుద్ధిచేయలేదన్న వార్తలొస్తుండగా అణుపరీక్షల వేళ అణుబాంబు పేల్చడం వల్లే భూమి కంపించి అది రిక్టర్ స్కేల్‌పై నమోదైందని మరికొందరు వాదిస్తున్నారు. వీటిల్లో నిజమెంత అనే దానిపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. అవి భూకంపనాలు కాదు, అణుబాంబు పేలుళ్లేనని నిర్ధారణ అయితేగనక ప్రపంచంలో పదో అణ్వస్త్రదేశంగా ఇరాన్ అవతరించిందని భావించాల్సి ఉంటుంది. అప్పుడు అణ్వస్త్రదేశంపై దాడులను కొనసాగించడంపై ఇజ్రాయెల్, దానికి మద్దతు పలకడంపై అమెరికా పునరాలోచన చేయడం ఖాయం.

### తొలుత ఫోర్డోలో.. తర్వాత సెమ్నాన్‌లో..

ఇజ్రాయెల్ క్షిపణిదాడుల తర్వాతే ఫోర్డోలో 2.5 తీవ్రతతో అదే రోజు భూకంపం సంభవించింది. ఇది జరిగిన ఐదు రోజులకు అంటే జూన్ 20వ తేదీ రాత్రి 9.19 గంటలకు ఉత్తర ఇరాన్‌లో 5.1 తీవ్రతతో మరోసారి భూమి కంపించింది. సెమ్నాన్‌కు ఆగ్నేయంగా 36 కిలోమీటర్ల దూరంలో భూఉపరితలానికి 10 కి.మీ.ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ భూకంపం ధాటికి ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా సమీప ప్రాంతాల్లో భూమి బాగా కంపించింది. ఇదే సమయంలో నటాంజ్, ఫోర్డో యురేనియం శుద్ధి కర్మాగారాలపై ఇజ్రాయెల్ బాంబులవర్షం కురిపించింది. దీంతో ఈ అణుకేంద్రాలు దెబ్బతిన్నాయి. ప్రైవేట్ ఉపగ్రహ చిత్రాల్లో చూస్తే అణుకేంద్రాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోందిగానీ వినాశనానికి కారణం బాంబు దాడులా, అణుబాంబు పేలుళ్ల అనేది ఎవరికీ తెలీదం లేదు.

### అవి నిజమైన భూకంపాలంటూ మరో వాదన

తాజా భూప్రకంపనలు కేవలం భూకంపాల కారణంగా సంభవించాయని, అణుపరీక్షలు జరగలేదని కొందరు వాదిస్తున్నారు. దీనికి చారిత్రక నేపథ్యం ఉంది. ఇరాన్ భౌగోళికంగా భూకంపాలు తరచూ సంభవించే ప్రాంతంలో ఉంది. ఆల్పైన్-హిమాలయన్ భూకంప పట్టీలో ఇరాన్ ఉంది. ఇక్కడ ఏటా సూక్ష్మస్థాయిలో ఏకంగా 2,000 భూకంపాలు వస్తాయి. రిక్టర్ స్కేల్‌పై 5 అంతకంటే ఎక్కువ తీవ్రతతో డజనుకుపైగా భూకంపాలు నమోదవుతాయి. 2006 నుంచి 2015 ఏడాదిదాకా గణాంకాలను పరిశీలిస్తే ఇరాన్‌లో 96,000 సార్లు భూకంపాలు వచ్చాయి. సాధారణంగా భూగర్భంలో అణుపరీక్షలు జరిపితే భూమి పైపై పొరలపై ఒత్తిడి కల్గి స్వల్పస్థాయిలో భూమి కంపిస్తుందని యూఎస్ జియోలాజికల్ సర్వే(యూఎస్‌జీఎస్) పేర్కొంది. అణుబాంబు పేలిన కారణంగా మొదలయ్యే భూకంపం తీవ్రత కొంతదూరానికే పరిమితమవుతుంది. అణుబాంబు పేలితే కేవలం పీ-బ్యాండ్ తరంగాలే ఉద్భవిస్థాయి. నిజంగా భూకంపం వస్తే పీ-బ్యాండ్‌తోపాటు ఎస్-బ్యాండ్ తరంగాలు కూడా వస్తాయి. ఎస్-బ్యాండ్ తరంగాలు తమ కేంద్రస్థానం నుంచి వెదజల్లబడి సూక్ష్మస్థాయిలో తిరిగి కేంద్రాన్ని చేరతాయి. పలు రకాల పరికరాల ద్వారా భూకంప శాస్త్రవేత్తలు దీనిని గుర్తించగలరు. ఈ లెక్కన 2.5 తీవ్రతతో వచ్చిన భూప్రకంపనలకు సహజ భూకంపమే కారణమని నిపుణులు నిర్ధారించారు. అయితే భూకంపం వచ్చిన అదే సమయానికి అదే ప్రాంతంలో ఇజ్రాయెల్ దాడులు చేయడం గమనార్హం

### ఆపరేషన్ సిందూర్ వేళ..

మే నెలలో నాలుగురోజులపాటు పాకిస్తాన్‌పై భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్'భీకర దాడుల వేళ సైతం పాకిస్తాన్‌లో భూకంపాలు సంభవించాయి. దీంతో పాకిస్తాన్‌లో అణుపరీక్షలు జరిగాయనే వాదన వినిపించింది. అయితే ఆ వాదన తప్పు అని తర్వాత తేలింది. సమగ్ర అణ్వస్త్ర వ్యాప్తినిరోధక ఒప్పందం(సీటీబీటీఓ), యూఎస్‌జీఎస్, స్వతంత్ర్య భూగోళశాస్త్ర అధ్యయనకారుల వాదన ప్రకారం ఒకవేళ భూప్రకంపనలు నమోదైతే, వాటి కేంద్రాన్ని 10 కి.మీ.ల లోతులో గుర్తిస్తే అది ఖచ్చితంగా సహజ భూకంపమే. ఎందుకంటే పది కిలోమీటర్ల లోతుకు భూమిని తవ్వి అక్కడ అణుబాంబును పేల్చడం అసాధ్యం. శుక్రవారం నమోదైన భూకంపం సంబంధ నాభి స్థానాన్ని 10 కి.మీ.ల లోతులో గుర్తించారు. ఈ లెక్కన ఇరాన్‌లో అణుపరీక్షలు జరగలేదనే వాదన తాజాగా బలపడింది.

# కోడింగ్ పోరులో కంపెనీలు..

**ఏఐ కోడింగ్ టూల్స్ మార్కెట్ ఏటా 28 శాతం వృద్ధి**

**2028 నాటికి 12.6 బిలియన్ డాలర్లకు చేరొచ్చని అంచనా**

**టూల్స్ వినియోగాన్ని 80 శాతానికి పెంచుకునే ప్రయత్నాల్లో సంస్థలు**

సాంకేతికత పెరిగే కొద్దీ కృత్రిమ మేథ (ఏఐ) రంగంలో కొత్త రకం యుద్ధాలు మొదలవుతున్నాయి. పైథాన్, రస్ట్‌లాంటి ప్రోగ్రామింగ్ ల్యాంగ్వేజ్‌లతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో వాటాల కోసం అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాలు, అంకుర సంస్థలు ఒకదానితో మరొకటి పోటీపడుతూ కత్తులు దూసుకుంటున్నాయి. ఏఐ టెక్ దిగ్గజాలు ఇటీవలే పోటాపోటీగా కొత్త సాధనాలను ఆవిష్కరించాయి. గూగుల్ తమ గోడింగ్ ఏజెంట్ జ్యూల్స్‌ను, మైక్రోసాఫ్ట్ గిట్‌హబ్ ఏఐ ఏజెంటును, కోడింగ్ స్టార్టప్ విండ్‌సర్ఫ్‌ను 3 బిలియన్ డాలర్లతో కొన్న ఊపులో ఓపెన్‌ఏఐ సంస్థ కోడెక్స్‌ను ప్రవేశపెట్టాయి. వీటన్నింటి లక్ష్యం ఏమిటంటే, కోడింగ్ రాయడంలో డెవలపర్లకు సహాయం చేయడం, బగ్‌లను ఫిక్స్ చేయడం, అలాగే కర్సర్, లవబుల్, బోల్ట్‌లాంటి స్టార్టప్‌లతో నేరుగా పోటీపడటం. డెవలపర్లు, అంకుర సంస్థలు ఈ పరిణామాలపై పెద్దగా ఆశ్చర్యపోవడం లేదు. జెన్‌ఏఐ రేసుతో ముందుగా ప్రభావం పడేది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విభాగమేనని పరిశీలకులు చెబుతున్నారు. కంపెనీలు ఇప్పటికే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోసం కోడింగ్ టూల్స్‌ను విరివిగా ఉపయోగిస్తుండటం ఇందుకు నిదర్శనమంటున్నారు.

### టూల్స్ వాడకం ఒక్కటే ఆప్షన్..

ఏఐ టూల్స్‌ను ఉపయోగించడాన్ని నేర్చుకోవడం తప్ప ప్రస్తుతం వేరే ఆప్షన్ లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్ కంపెనీల్లో ఇప్పటికే కోడింగ్ 30 శాతం ఏఐ ద్వారానే జరుగుతోంది. అటు ఇన్‌మొబీ సంస్థ కోడింగ్‌లో దాదాపు 50 శాతం ఏఐతోనే జరుగుతోంది. దీన్ని 80 శాతానికి పెంచుకునే ప్రయత్నాల్లో కంపెనీ ఉంది. మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాం మార్కెట్స్‌అండ్‌మార్కెట్స్ గణాంకాల ప్రకారం ఏఐ కోడింగ్ టూల్ మార్కెట్ ఏటా 28 శాతం వృద్ధి చెందుతూ 2028 నాటికి 12.6 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. ఉత్పాదకత పెరగడంపరంగా ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉండటం, మార్కెటింగ్ .. సేల్స్‌లాంటి నాన్-టెక్నికల్ టీమ్‌లు కూడా ఉపయోగించడానికి సులువుగా ఉండటం వంటి అంశాల కారణంగా కోడింగ్ టూల్స్ వినియోగం పెరుగుతోంది. దీంతో ఈ విభాగంపై భారీగా ఇన్వెస్ట్ చేసిన టెక్ దిగ్గజాలకు ఆదాయార్జనకు ఇదొక కొత్త మార్గంగా నిలుస్తోంది.




### కొత్త ఆదాయ మార్గం..

ఫౌండేషనల్ మోడల్స్‌పై కోట్ల కొద్దీ డాలర్లు కుమ్మరించిన కంపెనీలు ఇప్పుడు వాటిపై రాబడులు అందుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నాయని ఎల్‌ఎల్‌ఎం ఎవాల్యుయేషన్ ప్లాట్‌ఫాం అయిన నోవియం వర్గాలు తెలిపాయి. ఎల్‌ఎల్‌ఎంలకు కోడ్ జనరేట్ చేయడమనేది ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోందని వివరించాయి. కర్సర్ అనే సంస్థ గత రెండేళ్లుగా ఏటా 300 మిలియన్ డాలర్ల మేర ఆదాయాలను ఆర్జిస్తోందని పేర్కొన్నాయి. ఇక బోల్ట్, లవబుల్‌లాంటి సంస్థలు కూడా ఊహించని స్థాయిలో ఆదాయాలు ఆర్జిస్తున్నాయి. తమ ఇంజినీర్ల ఉత్పాదకత కనీసం 10-20 శాతమైన పెరుగుతుందంటే ఈ టూల్స్‌పై ఇన్వెస్ట్ చేసేందుకు కంపెనీలు ముందుకొస్తున్నాయి. ప్రస్తుతం కోడింగ్ ఆటోమేషన్ అనేది ప్రస్తుతం హాట్ సెక్టార్‌గా మారిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. టెక్నికల్‌యేతర నేపథ్యాలున్న వారు కూడా సులభంగా, సరళంగా వెబ్‌సైట్‌లు, చాట్‌బాట్లను రూపొందించడానికి ఇది ఉపయోగపడుతోందని వివరించాయి. సాధారణంగా పెద్ద కంపెనీల్లో ఏఐ టూల్స్‌ను మిగతా అవసరాల కోసం పెద్దగా ఉపయోగించకపోయినా ఉత్పాదకతను పెంచుకునేందుకు ఉపయోగించుకుంటున్నాయి.

### సవాళ్లూ ఉన్నాయి..

కోడింగ్ పని 70 శాతం వేగవంతమవడానికి ఏఐ టూల్స్ ఉపయోగపడుతున్నాయి. కోడింగ్ చేయడానికి టూల్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నప్పటికీ, వీటితో సవాళ్లు కూడా ఉన్నాయని నిపుణులు తెలిపారు. పని వేగవంతమవుతోంది కాబట్టి ఏఐని ఉపయోగించి ప్రతి ఒక్కరూ కోడింగ్ చేసేయొచ్చనే అపోహలు ఉంటున్నాయని పేర్కొన్నారు. 70 శాతం పూర్తయితే సరిపోదు, దాన్ని 100 శాతం వరకు తీసుకెళ్లేందుకు నిపుణుల అవసరం అవుతుందని వివరించారు. అంతేగాదు, కోడింగ్ టూల్స్ వినియోగం పెరిగే కొద్దీ రివ్యూ చేయాల్సిన కోడ్స్ సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని పేర్కొన్నారు. తమ కస్టమర్లపై ప్రభావం పడకుండా రివ్యూ ప్రక్రియలను కూడా కంపెనీలు ఆటోమేట్ చేస్తున్నాయి. తాము ఏకకాలంలో వివిధ సిస్టమ్‌లను అభివృద్ధి చేస్తూనే, వాటి అమలు తీరుతెన్నులను కూడా పర్యవేక్షించే ప్రయత్నాల్లో ఉన్నామని ఇన్‌మొబి వర్గాలు తెలిపాయి. ఎప్పటికప్పుడు తప్పొప్పులను పరీక్షించుకుంటూ ముందుకెళ్తుండటం వల్ల తమ దగ్గర కోడింగ్‌లో ఏఐ వినియోగం ప్రస్తుతానికి యాభై శాతం స్థాయిలోనే ఉందని వివరించాయి.

# సింగయ్య ఘటనపై ఎల్లో మీడియా క్షుద్ర రాజకీయాలు




గుంటూరు: ఈ రాష్ట్రంలో ఆంధ్రజ్యోతి, ఈనాడు సంస్థలు ప్రజలకు వాస్తవాలను చెప్పడానికి బదులు చంద్రబాబుకు దాసోహమై నిత్యం తన అబద్ధపు రాతలతో వైఎస్ జగన్ వ్యక్తిత్వహననమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరు క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైయస్ జగన్ సత్తెనపల్లి పర్యటనలో దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో సింగయ్య అనే అభిమాని చనిపోతే, ఆ మరణంపై ఏ మాత్రం మానవత్వం లేకుండా ఎల్లో మీడియా క్షుద్రరాతలతో వైఎస్సార్‌సీపీపై విషం చిమ్ముతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ పర్యటనలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో వున్న కూటమి ప్రభుత్వ కుట్రలకు ఎల్లో మీడియా కూడా భాగస్వామిగా మారిందని ధ్వజమెత్తారు. ఇంకా ఆయనేమన్నారంటే. వైఎస్ జగన్ సత్తెనపల్లి పర్యటన సందర్భంగా దురదృష్టవశాత్తు వెంగళాయపాలేనికి చెందిన సింగయ్య అనే వ్యక్తి యాక్సిడెంట్‌లో చనిపోగా, సత్తెనపల్లిలో జయవర్ధన్‌రెడ్డి అనే యువకుడు వడదెబ్బ కారణంగా గుండెపోటుకు గురై మృతిచెందారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వాహనం కానీ, ఆయన కాన్వాయ్ వాహనాలు కానీ సింగయ్యను ఢీకొట్టలేదని ఎస్పీ స్వయంగా వెల్లడించారు. కాన్వాయ్‌కి ముందు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఆయన ప్రమాదానికి గురైనట్టు ఎస్పీ ధ్రువీకరించారు. దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదాన్ని కూడా రాజకీయం చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది. వైఎస్ జగన్ పర్యటన కోసం సింగయ్యతో పాటు మరో 40 మందిని మా పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాలసాని కిరణ్ కుమార్ తీసుకొచ్చినట్టుగా రాసిన స్టేట్‌మెంట్ మీద సంతకం పెట్టమని సింగయ్య మృతదేహానికి పోస్టుమార్టం సమయంలో ఆయన భార్యను పోలీసులు ఒత్తిడి చేశారు. పోలీసులు రాసి తీసుకొచ్చిన తప్పుడు స్టేట్‌మెంట్‌పై ఆ సమయంలో అక్కడే ఉన్న పార్టీ నాయకులమంతా అడ్డం తిరగడంతో పోలీసులు సింగయ్య భార్య, ఆమె బంధువులు ఇచ్చిన స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని వెళ్లిపోయారు. లేదంటే దీన్ని హత్యకేసుగా చిత్రీకరించి ఎవరో ఒకర్ని ఇరికించాలన్న కుట్ర అప్పుడే జరిగింది.

**వైఎస్ జగన్‌ని ఇబ్బంది పెట్టాలన్నదే వారి లక్ష్యం**

రాష్ట్రంలో ఏ మూలన ఏ సంఘటన జరిగినా పోలీసుల కన్నా ముందే ఈనాడు, ఆంధ్రజ్యోతి దర్యాప్తు చేసి రిపోర్టును ప్రింట్ చేస్తున్నాయి. వైఎస్ జగన్ వ్యక్తిత్వ హననమే ఎజెండాగా ఈ రెండు పత్రికలు ఏ చిన్న సంఘటన జరిగినా దానిని చిలువలు వలవులుగా చేసి మా నాయకునికి నేరాన్ని ఆపాదించే కుట్రలు చేస్తున్నారు. సింగయ్య మరణం ప్రమాదవశాత్తు జరిగిందని అందరికీ తెలిసిన సత్యం. చంద్రబాబు పర్యటనల్లోనూ చాలాసార్లు ఇలాంటి సంఘటనలు జరిగాయి. తొక్కిసలాటల్లో కూడా అమాయకులు బలయ్యారు. ఈ వాస్తవాలను పక్కనపెట్టి ఈనాడు, ఆంధ్రజ్యోతి వక్రీకరించి తప్పుడు కథనాలు రాస్తున్నారు. 'జగన్ వాహనానికి సింగయ్య బలి', 'సింగయ్యను బలి తీసుకున్న జగన్ వాహనం' అంటూ ఈ రెండు పత్రికలు ప్రమాదాన్ని హత్యగా చూపించాలని క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారు. తన వాహనమే కాదు, ఆయన కళ్లముందు ఏదైనా ప్రమాదం జరిగినా వారిని ఆస్పత్రి చేర్చేవరకు ఆయన ఊరుకోరు. అలాంటిది జగనే స్వయంగా కారేసుకెళ్లి సింగయ్యను గుద్ది చంపాడు అన్నంతలా దుష్ప్రచారం చేస్తున్నారు. ఎవరికో ప్రమాదం జరిగితేనే తట్టుకోలేని జగన్, మా కార్యకర్త సింగయ్య చనిపోతే ఎలా వదిలేస్తారనుకున్నారు? ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. ఇప్పటికే వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 లక్షల చెక్కును పార్టీ తరఫున వారి కుటుంబానికి అందజేయడం కూడా జరిగింది.

**చనిపోయిన వ్యక్తుల గురించి నీచంగా రాస్తున్నారు**

వైయస్ జగన్ పర్యటన విజయవంతం కావడంతో ఓర్వలేక క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారు. వైఎస్ జగన్ ఎప్పటికీ బయటకు రావొద్దనే లక్ష్యంతో ప్రభుత్వం తప్పుడు కథనాలు రాయించి, తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సత్తెనపల్లి పర్యటన విజయవంతం కావడంతో దాని మీద ఇప్పటికే మా నాయకులు గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మీద కేసులు పెట్టారు. నాకు కూడా నిన్న రాత్రి నోటీసులు ఇచ్చి వెళ్లారు. చంద్రబాబుని జైల్లో పెట్టామనే కక్షతో ఇప్పుడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులందర్నీ లోకేష్ జైళ్లకు పంపుతున్నాడు. ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. వెనకడుగు వేసే ప్రసక్తే ఉండదు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

## వెనక్కి తగ్గిన అమెరికా – చైనా

## (విశ్లేషణ)

వేలంపాట తరహాలో అమెరికా, చైనాలు ఒకరిపై ఒకరు సుంకాలు పెంచుకుంటూ పోయిన వైనంతో బెంబేలెత్తిన ప్రపంచ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థలూ నేల చూపులు చూస్తున్న వేళ జెనీవా నుంచి సోమవారం ఒక చల్లని కబురు వినబడింది.ఆర్థికంగా ప్రపంచంలోనే ఒకటి, రెండు స్థానాల్లో ఉన్న ఇరు దేశాలూ ప్రస్తుతానికి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాయన్నదే దాని సారాంశం. ఇది బుధవారం నుంచి అమల్లోకొచ్చి తొంభై రోజులపాటు... అంటే మూణ్ణెల్లపాటు అమల్లో వుంటుందనీ, రెండు దేశాల ప్రతినిధులతో ఏర్పడిన సలహా యంత్రాంగం ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందనీ ఉమ్మడి ప్రకటన వివరిస్తోంది.ఈ సలహా యంత్రాంగంలో చైనా తరపున ఆ దేశ ఉపప్రధాని హె లిఫాంగ్ , అమెరికా తరపున ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్, వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీయర్‌లుంటారు. మూర?త్వంలో ఎవరికెవరూ తీసిపోని ఈ రెండు పక్షాలూ చివరికేం చేస్తాయన్నది ఇంకా చూడాల్సేవున్నా ఇప్పటికైతే ఒక ముప్పు తాత్కాలికంగానైనా ఉపశమించిందని సంతోషించక తప్పదు. మొన్న జనవరిలో అమెరికాలో అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ ప్రపంచాన్ని హడలెత్తిస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న వరస నిర్ణయాల్లో ఈ సుంకాల పెంపు వ్యవహారం అతి పెద్దది.గత నెల 2 నుంచి అమల్లోకొచ్చిన ఈ పెంపు చైనా మినహా వేరే దేశాలపై తాత్కాలికంగా ఆపేస్తున్నట్టు ట్రంప్ ఆ వెంటనే ప్రకటించారు. కానీ కోడెల పోట్లాటల మధ్య లేగల కాళ్లు విరిగినట్టు అమెరికా–చైనా సుంకాల యుద్ధంతో ప్రపంచమంతటికీ సమస్యలు తలెత్తాయి. తాజా ఒప్పందం పర్యవసానంగా అమెరికా విధించిన 145 శాతం సుంకాలు కాస్తా 30 శాతానికి తగ్గుతాయి.అలాగే అమెరికా దిగుమతులపై చైనా విధించిన 125 శాతం సుంకాలు 10 శాతానికి దిగొస్తాయి. ఈ వారం ఆఖరులోగా తాను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చిస్తానని ట్రంప్ చెప్పటం కూడా సంతోషించదగ్గది. చైనాతో సుంకాల విషయమై చర్చలు సాగుతున్నాయని ఆ మధ్య ట్రంప్ పదే పదే ప్రకటించగా చైనా ఖండించింది. చివరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో చర్చలు సాకారమయ్యాయి.చైనాను దెబ్బతీసే ఉద్దేశం తమకు మొదణ్ణించీ లేదని ట్రంప్ ప్రకటించారు. ఇది స్వాగతించ దగ్గదే అయినా బడాయి మాటనే చెప్పాలి. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయటం సంగతలా వుంచి అమెరికాలోని తయారీరంగ పరిశ్రమలు ముడిసరుకులు దొరక్క ఇబ్బందులుపడుతూ దివాలా దశకు చేరాయి. ఉద్యోగాలకు కోతబెట్టాయి.వినియోగదారులు సైతం ఉత్పత్తులు అందుబాటులో లేకపోవటంతో పాటు, లభ్యమైన సరుకు ధర ఆకాశాన్నంటడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయి సతమతమవుతుంటే సరుకును రెట్టింపు, అంతకన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి రావటం వారిని కుంగదీసింది. చైనాలోనూ పరిస్థితి ఏమంత సజావుగా లేదు. అనేక కంపెనీలు మూతబడ్డాయి. కొన్ని సంస్థలు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులపై దృష్టి సారించాయి.ట్రంప్ అధికారంలోకొస్తూనే దేశంలో యువత ప్రాణాలు తీస్తున్న మత్తు పదార్థం ఫెంటానిల్ విచ్చలవిడిగా దొరకటంలో చైనా పాత్రవుందని ఆరోపిస్తూ ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై 20 శాతం అదనంగా సుంకాలు పెంచారు. గత నెల 2 నుంచి దానికి మరో 34 శాతం జోడించారు. ఇలా తమ నుంచి వెళ్లిన సరుకులపై 54 శాతం సుంకాలు విధించటాన్ని జీర్ణించుకోలేని చైనా దానికి ప్రతీ కారంగా అమెరికా దిగుమతులపై 34 శాతం మేర అదనపు సుంకాలు విధించింది.ఇక అక్కడి నుంచి ఇద్దరిమధ్యా 'చంపుడు పందెం' మొదలైంది. నిజానికి ట్రంప్‌కు ముందు ఫెంటానిల్‌తో చైనాకు లంకె పెట్టినవారెవరూ లేరు. అధ్యక్ష ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆయన దాన్ని ఎక్కువచేసి చూపారు. మొత్తానికి అమెరికా 145 శాతం, చైనా 125 శాతం సుంకాల దగ్గర ఆగాయి.ఇప్పుడు కుదిరిన ఒప్పందం పర్యవసానంగా గంపగుత్తగా అన్ని రకాల సరుకులపైనా సుంకాలు తగ్గిపోవు. చైనా సరుకులపై అమెరికా విధించిన 30 శాతం సుంకాలు కొనసాగుతాయి. అలాగే విద్యుత్ వాహనాలు, ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఇంతకన్నా ఎక్కువగానే సుంకాలున్నాయి. అవన్నీ గత కొన్ని సంవత్సరాల్లో విధించినవి కనుక ఈ ఒప్పందం వాటి జోలికిపోదు.అవతలిపక్షం నుంచి ఎలాంటి రాయితీలూ పొందకుండా, తమకనుకూలమైన ముగింపు వైపుగా చర్యలేమీ కనబడకుండా ఒప్పందానికి రావటం బలహీనతను సూచిస్తుంది తప్ప బలాన్ని కాదు. ప్రస్తుత ఒప్పందం వ్యూహాత్మకమైనదని చెప్పుకున్నా, మున్ముందు దేశానికేదో ఒరుగుతుందని అంటున్నా... అధిక సుంకాల మోత నుంచి వెనక్కి తగ్గమని ట్రంప్‌పై దేశంలో అన్నివైపుల నుంచీ ఒత్తిళ్లు వచ్చాయన్నది వాస్తవం.నిరుటి గణాంకాలు గమనిస్తే రెండు దేశాలూ వాణిజ్య పరంగా పరస్పరం ఆధారపడినవేనని తెలుస్తుంది. చైనా ఎగుమతుల్లో అమెరికా వాటా 12.9 శాతం. అలాగే అమెరికా మొత్తం ఎగుమతుల్లో చైనా వాటా 14.8 శాతం. కెనడా, మెక్సికోల తర్వాత స్థానం చైనాదే. అధిక సుంకాల యుద్ధం చివరకు ప్రపంచ ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుందని, ఉత్పత్తుల కొరతను సృష్టించి ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని... ఇదంతా చిట్టచివరకు అమెరికాను మాంద్యం ఊబిలోకి నెడుతుందని నిపుణులు మొదణ్ణించీ హెచ్చరిస్తూనే ఉన్నారు.సర్వజ్ఞుణ్ణని భావించేవారికి చెప్పటానికి ప్రయత్నించటం వృథా ప్రయాస. ఏదైనా అనుభవంలోకొస్తే తప్ప తత్వం బోధపడదు. మొత్తానికి ఈ చర్చల వల్ల ఇప్పటికైతే అర్థవంతమైన పరిష్కారం లభించలేదు. మున్ముందు ఏమవుతుందన్నది రెండు దేశాల విజ్ఞతకూ పరీక్ష.

# 'మిడ్ నైట్ హ్యామర్'... ఇరాన్ పై దాడుల పట్ల స్పందించిన అమెరికా రక్షణ శాఖ

**ఇరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై అమెరికా 'మిడ్‌నైట్ హ్యామర్' పేరుతో దాడి**

**ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై భీకర దాడులు**

**ఇరాన్‌లో అణు కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడమే ధ్యేయమని అమెరికా స్పష్టం**




ఇరాన్ అణు కార్యక్రమానికి గట్టి దెబ్బ తగిలేలా అమెరికా భారీ వైమానిక దాడులకు దిగింది. గత కొన్ని దశాబ్దాలలో ఇదే అతిపెద్ద వైమానిక చర్య అని భావిస్తున్నారు. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్‌లలో ఉన్న కీలక అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపినట్లు అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ ధృవీకరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యక్ష ఆదేశాలతో 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరుతో చేపట్టిన ఈ చర్య "అద్భుతమైన, సంపూర్ణ విజయం" సాధించిందని ఆయన ఆదివారం ఒక విలేకరుల సమావేశంలో ప్రకటించారు. "అధ్యక్షుడు ట్రంప్ రూపొందించిన ఈ ఆపరేషన్ సాహసోపేతమైనది, అద్భుతమైనది. అమెరికా నిరోధక శక్తి తిరిగి వచ్చిందని ఇది ప్రపంచానికి చాటింది. ఈ అధ్యక్షుడు మాట్లాడితే ప్రపంచం వినాలి" అని హెగ్సెత్ స్పష్టం చేశారు. అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ తో పాటు జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ ఎయిర్ ఫోర్స్ జనరల్ డాన్ కెయిన్ కూడా వివరాలు వెల్లడించారు. ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ నగరాల్లోని ఇరాన్ అణు కేంద్రాలు ఈ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయని, విధ్వంసం అంచున ఉన్నాయని ప్రాథమిక నష్ట అంచనా నివేదికలు చెబుతున్నాయని వారు తెలిపారు. తుది అంచనా ఇంకా కొనసాగుతోందని వారు పేర్కొన్నారు. "మేము ఇరాన్ అణు కార్యక్రమాన్ని ధ్వంసం చేశాం" అని హెగ్సెత్ అన్నారు. "ఈ ఆపరేషన్ ఇరాన్ సైనికులు లేదా ప్రజలను లక్ష్యంగా చేసుకోలేదు" అని ఆయన స్పష్టం చేశారు. "ఈ మిషన్ ఇరాన్ లో ప్రభుత్వ మార్పు కోసం కాదు. ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చడం మా లక్ష్యం కాదు. ఇరాన్ అణు కార్యక్రమం వల్ల మా జాతీయ ప్రయోజనాలకు ఎదురయ్యే ముప్పును నిర్వీర్యం చేయడానికే అధ్యక్షుడు (డొనాల్డ్ ట్రంప్) ఈ కచ్చితమైన ఆపరేషన్‌కు అనుమతించారు" అని హెగ్సెత్ వివరించారు. దాడి అనంతరం శాంతి చర్చల కోసం ఇరాన్‌కు బహిరంగంగా, అంతర్గతంగా సందేశాలు పంపుతున్నామని కూడా ఆయన తెలిపారు. శాంతి కోసం ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు కోరినప్పటికీ, ఇరాన్ పట్టించుకోలేదని హెగ్సెత్ గుర్తుచేశారు.

**భూగర్భ అణు కేంద్రాలపై భారీ బాంబులు, క్షిపణులు**

ఈ ఆపరేషన్‌లో భాగంగా, ఏడు %దీ%-2 స్పిరిట్ బాంబర్లు మొత్తం పద్నాలుగు 30,000 పౌండ్ల బరువున్న జీబీయూ-57 భారీ విధ్వంసక బాంబులను జారవిడిచాయి. ఇవి భూగర్భంలో లోతుగా నిర్మించిన ఫోర్డో, నతాంజ్ అణు కేంద్రాలపై పడినట్లు సమాచారం. ఇస్ఫహాన్‌లోని లక్ష్యాలపై జలాంతర్గామి నుంచి టోమాహాక్ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించారు. ఇక్కడ ఇరాన్ భారీ మొత్తంలో అధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వ చేసిందని అమెరికా వర్గాలు తెలిపాయి. "ప్రపంచంలో మరే ఇతర సైనిక శక్తి ఇలాంటి చర్యను చేపట్టలేదు" అని జనరల్ డాన్ కెయిన్ అన్నారు. "చాలా తక్కువ సమాచార మార్పిడితో, ప్రత్యర్థిని జాగ్రత్తగా ఏమార్చే వ్యూహాలతో ఈ ఫలితాలు సాధించాం" అని ఆయన వివరించారు. ఈ దాడుల్లో 125కి పైగా విమానాలు, సహాయక విభాగాలు పాలుపంచుకున్నాయని, వీటిలో స్టెల్త్ ఫైటర్లు, నిఘా విమానాలు, గాలిలో ఇంధనం నింపే ట్యాంకర్లు ఉన్నాయని జనరల్ కెయిన్ తెలిపారు. "అమెరికా చరిత్రలో ఇదే అతిపెద్ద %దీ%-2 ఆపరేషన్, ప్రపంచంలో రెండో అతిపెద్దది" అని ఆయన పేర్కొన్నారు.

# హోర్ముజ్ జలసంధి మూసివేతకు ఇరాన్ పార్లమెంటు ఆమోదం.

.. చమురు ధర భారీగా పెరిగే చాన్స్!

ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు

హోర్ముజ్ జలసంధి మూసివేతకు ఇరాన్ పార్లమెంట్ ఓటు

తుది నిర్ణయం తీసుకోనున్న సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్, ఖమేనీ

"ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్" తో అణు స్థావరాలు ధ్వంసం అన్న ట్రంప్

జలసంధి మూతపడితే చమురు ధరలు ఆకాశానికి






ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా, ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గాలలో ఒకటైన హోర్ముజ్ జలసంధిని మూసివేయాలన్న ప్రతిపాదనకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆదివారం జరిగిన ఓటింగ్‌లో పార్లమెంట్ సభ్యులు ఈ నిర్ణయానికి మద్దతు పలికినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ విషయంలో తుది నిర్ణయం దేశ అత్యున్నత జాతీయ భద్రతా మండలి (సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్) మరియు దేశ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీలదేనని స్పష్టమవుతోంది. పార్లమెంట్ ఓటింగ్ కేవలం ఒక సిఫారసు మాత్రమే. "హోర్ముజ్ జలసంధిని మూసివేయాలనే నిర్ధారణకు పార్లమెంట్ వచ్చింది. అయితే, దీనికి సంబంధించిన తుది నిర్ణయం సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ చేతిలో ఉంది" అని పార్లమెంట్ జాతీయ భద్రతా కమిషన్ సభ్యుడు, రెవల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇస్మాయిల్ కౌసరి ఆదివారం ప్రకటించినట్లు అల్ అరేబియా, జెరూసలేం పోస్ట్ పత్రికలు తెలిపాయి. పార్లమెంట్ ఆమోదంతో, హోర్ముజ్ జలసంధి మూసివేతకు సంబంధించిన తుది చర్యను అయతొల్లా ఖమేనీ ఆమోదించాల్సి ఉంటుంది. ఇది ఆదివారం నాడే జరిగే అవకాశం కూడా ఉంది. హోర్ముజ్ జలసంధి అనేది పర్షియన్ గల్ఫ్‌ను గల్ఫ్ ఆఫ్ ఒమన్ మరియు అరేబియా సముద్రంతో కలిపే ఒక ఇరుకైన జలమార్గం. దీని ఇరుకైన ప్రదేశంలో వెడల్పు సుమారు 21 మైళ్లు కాగా, ఇరువైపులా రెండు మైళ్ల వెడల్పుతో రెండు నౌకా రవాణా మార్గాలున్నాయి. ప్రపంచ చమురు వాణిజ్యంలో దాదాపు 20 శాతం ఈ జలసంధి గుండానే సాగుతుంది. ఒకవేళ ఇరాన్ ఈ జలసంధిని మూసివేస్తే, తక్షణమే ముడి చమురు ధరలు 30 నుంచి 50 శాతం పెరిగే అవకాశం ఉందని, అదేవిధంగా గ్యాసోలిన్ ధరలు గ్యాలన్‌కు 5 డాలర్ల వరకు పెరగవచ్చని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. హోర్ముజ్ జలసంధిని మూసివేయడమంటే, నౌకల రాకపోకలను అసాధ్యంగా మార్చడమే. ఇరాన్ నౌకాదళం జలాల్లో మైన్‌లను అమర్చడం ద్వారా లేదా ట్యాంకర్లపై క్షిపణులతో దాడులు చేయడం ద్వారా ఈ మార్గాన్ని అడ్డగించవచ్చు. 1980లలో ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో, ఇరాన్ చమురు ట్యాంకర్లు మరియు చమురు లోడింగ్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. ఆ చర్యలు జలసంధిని పూర్తిగా అడ్డుకోనప్పటికీ, నౌకా రవాణా బీమా ప్రీమియంలు విపరీతంగా పెరగడానికి, సముద్ర ట్రాఫిక్ ఆలస్యం కావడానికి కారణమయ్యాయి. ఇరాన్ చాలాకాలంగా హోర్ముజ్ జలసంధిని మూసివేయగలమని, దీనిని ఉద్రిక్తతలు పెంచడానికి చివరి అస్త్రంగా పరిగణిస్తోందని చెబుతూ వస్తోంది.

# ఈ ఐదు ఆహారాలలో క్యాన్సర్ కారక పదార్థం!

మన దైనందిన జీవితంలో తీసుకునే అనేక సాధారణ ఆహార పదార్థాలలో అక్రిలమైడ్ అనే రసాయనం ఉంటుందని తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ముఖ్యంగా పిండి పదార్థాలు కలిగిన ఆహారాన్ని అధిక ఉష్ణోగ్రతల వద్ద వేయించడం, బేకింగ్ చేయడం లేదా రోస్టింగ్ చేయడం వంటి పద్ధతుల్లో వండినప్పుడు ఇది తయారవుతుంది. అక్రిలమైడ్‌కు, క్యాన్సర్‌కు మధ్య ఉన్న సంబంధంపై శాస్త్రవేత్తలు ఇంకా లోతైన అధ్యయనాలు చేస్తున్నప్పటికీ, దీనికి తరచుగా గురికావడాన్ని తగ్గించుకోవాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వంట చేసే పద్ధతుల్లో కొన్ని చిన్నపాటి మార్పులు చేసుకుంటే, ఆహారపు రుచిలో పెద్దగా తేడా లేకుండానే అక్రిలమైడ్ మోతాదును తగ్గించుకోవచ్చని వారు సూచిస్తున్నారు. అక్రిలమైడ్ సాధారణంగా ఎక్కువగా ఏర్పడే కొన్ని ఆహార పదార్థాలు, వాటిని సురక్షితంగా ఆస్వాదించే పద్ధతులు ఇక్కడ ఉన్నాయి.

కరకరలాడే స్నాక్స్ మరియు ఫ్రైస్

బంగాళాదుంప చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, ఇతర నూనెలో బాగా వేయించిన స్నాక్స్ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉంటాయి. బంగాళాదుంపలను అధిక వేడి వద్ద వేయించినప్పుడు లేదా బేక్ చేసినప్పుడు, వాటిలోని సహజ చక్కెరలు అమైనో ఆమ్లాలతో చర్య జరిపి అక్రిలమైడ్‌ను ఉత్పత్తి చేస్తాయి. పదార్థం ఎంత ఎక్కువగా వేగి, ఎంత ముదురు రంగులోకి మారితే, అంత ఎక్కువ అక్రిలమైడ్ ఉంటుంది. వీటికి బదులుగా ఉడికించిన లేదా ఎయిర్-ఫ్రై చేసిన వాటిని ఎంచుకోవడం, మరీ ఎక్కువగా వేగించకపోవడం ద్వారా దీని ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.

ప్యాకేజ్డ్ బిస్కెట్లు మరియు కుకీలు

వీటిని తరచుగా అధిక ఉష్ణోగ్రతల వద్ద బేక్ చేస్తారు. వీటిలో అక్రిలమైడ్‌తో పాటు, అదనపు ప్రిజర్వేటివ్‌లు, శుద్ధి చేసిన చక్కెర కూడా ఉండవచ్చు. ఇవి తినడానికి రుచిగా, కరకరలాడుతూ ఉన్నప్పటికీ, తరచుగా తీసుకోవడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. టీతో పాటు బిస్కెట్ తినే అలవాటు ఉంటే... బయట కొనుగోలు చేసిన, బాగా వేగిన వాటికి బదులుగా ఇంట్లో తయారుచేసుకున్న లేదా తక్కువగా బేక్ చేసిన వాటిని ప్రయత్నించడం మేలు.

మాడిన టోస్ట్ మరియు బాగా వేగిన బ్రెడ్

టోస్ట్ మీద బంగారు రంగులో ఉండే పొర చూడటానికి బాగానే అనిపించవచ్చు, కానీ మరీ ఎక్కువగా వేగించడం వల్ల ఎక్కువ అక్రిలమైడ్ ఏర్పడుతుంది. బ్రెడ్‌ను లేతగా టోస్ట్ చేసుకోవడం, బాగా నల్లగా లేదా మాడిపోయినట్లు కనిపించే వాటిని తినకపోవడం ఉత్తమం. తక్కువగా టోస్ట్ చేసిన హోల్‌గ్రెయిన్ బ్రెడ్‌లు ఫైబర్ కోసం మంచివి, అలాగే అక్రిలమైడ్ కూడా తక్కువగా ఉంటుంది.

కాఫీ..

ఆశ్చర్యకరంగా కాఫీలో కూడా అక్రిలమైడ్ ఉంటుంది. కాఫీ గింజలను వేయించే (రోస్టింగ్) ప్రక్రియలో ఇది ఏర్పడుతుంది. దీనివల్ల కాఫీని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు, కానీ మితంగా తీసుకోవడం, ఇంట్లో గింజలను అతిగా వేయించకపోవడం మంచిది. కోల్డ్ బ్రూ కాఫీలు, లైట్ రోస్ట్ కాఫీలలో అక్రిలమైడ్ స్థాయిలు తక్కువగా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ప్యాకేజ్డ్ సీరిల్స్

మొక్కజొన్న (కార్న్) లేదా గోధుమలతో తయారుచేసి, మంచి కరకరలాడే స్వభావం కోసం అధిక ఉష్ణోగ్రతల వద్ద వేయించిన (టోస్ట్ చేసిన) లేదా బేక్ చేసిన సీరిల్స్‌లో అక్రిలమైడ్ ఏర్పడే ఆస్కారం ఉందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఆహార పదార్థాలను ఎక్కువ వేడికి గురిచేసినప్పుడు, వాటిలోని చక్కెరలు, అమినో ఆమ్లాల మధ్య జరిగే రసాయనిక చర్యల వల్ల అక్రిలమైడ్ ఉత్పత్తి అవుతుంది. ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆహారపు అలవాట్లలో ఇటువంటి చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అక్రిలమైడ్ వంటి హానికర రసాయనాల ప్రభావం నుండి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# 2026 టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు కూర్పుపై ఉత్కంఠ..

## సూర్య కెప్టెన్సీలో యువతకు పెద్దపీట?






- వచ్చే ఏడాది భారత్, శ్రీలంక ఆతిథ్యంలో టీ20 ప్రపంచకప్
- సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో టైటిల్ నిలబెట్టుకోవడమే లక్ష్యం
- గిల్, జైస్వాల్ తిరిగి జట్టులోకి... అభిషేక్ శర్మ నిలకడైన ప్రదర్శన
- మిడిలార్డర్‌లో తిలక్ వర్మ, శ్రేయస్ అయ్యర్‌లకు చోటు ఖాయం
- సంజూ శాంసన్ ప్రధాన వికెట్ కీపర్... రెండో స్లాట్ కోసం పోటీ
- పాండ్యా, అక్షర్, కుల్దీప్, వరుణ్ ఎంపిక లాంఛనమే
- బుమ్రా, అర్ష్‌దీప్‌తో పాటు మూడో పేసర్‌గా హర్షిత్ రాణాకు అవకాశం

వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్‌నకు ఇప్పటినుంచే రంగం సిద్ధమవుతోంది. 2024 టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో, కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో భారత జట్టు అద్భుత విజయాలతో దూసుకుపోతోంది. ఇప్పటివరకు ఆడిన 15 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో 2026 మెగా టోర్నీలో టైటిల్ నిలబెట్టుకోవడమే లక్ష్యంగా టీమిండియా వ్యూహరచన చేస్తోంది. 2025 ఐపీఎల్ ప్రదర్శన, కొందరు ఆటగాళ్లకు జాతీయ జట్టులోకి రావడానికి చివరి అవకాశంగా నిలిచింది.

ఓపెనర్లుగా గిల్, జైస్వాల్... ఆకట్టుకుంటున్న అభిషేక్

గత ఏడాది టెస్ట్ క్రికెట్, ఆ తర్వాత జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీపై దృష్టి సారించడం వల్ల పొట్టి ఫార్మాట్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఐపీఎల్‌లో వీరిద్దరూ బ్యాటింగ్‌లో అదరగొట్టారు. ఇటీవలే భారత టెస్ట్ జట్టు కెప్టెన్‌గా నియమితుడైన గిల్.. శ్రీలంకతో జరిగిన చివరి టీ20 సిరీస్‌లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. దీంతో, సూర్యకుమార్‌కు డిప్యూటీగా గిల్‌ను ఎంపిక చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. మరోవైపు, భారత జట్టులోకి అరంగేట్రం చేసినప్పటి నుంచి అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న అభిషేక్ శర్మ, ఇంగ్లండ్‌తో జరిగిన గత టీ20 మ్యాచ్‌లో కేవలం 37 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. అతని లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్ కూడా జట్టుకు అదనపు బలం చేకూర్చనుంది.

మిడిలార్డర్‌లో తిలక్, శ్రేయస్ స్థానాలు పదిలం

మిడిలార్డర్ విషయానికొస్తే దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలు, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో క్లిష్టమైన పరిస్థితుల్లో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మ స్థానానికి ఎలాంటి ఢోకా లేదు. ఇక, డిసెంబర్ 2023 తర్వాత భారత జట్టు తరఫున టీ20 మ్యాచ్ ఆడకపోయినప్పటికీ, 2025 ఐపీఎల్‌లో 604 పరుగులు చేసి శ్రేయస్ అయ్యర్ సత్తా చాటాడు. అంతేకాకుండా, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో టీమిండియా తరఫున టాప్ స్కోరర్‌గా నిలవడం అతన్ని విస్మరించలేని శక్తిగా మార్చింది. శ్రేయస్ నాయకత్వ పటిమ కూడా జట్టుకు ఉపయోగపడే అవకాశం ఉంది.

వికెట్ కీపర్‌గా సంజూ... రెండో స్థానానికి పోటీ

వికెట్ కీపర్ బ్యాటర్ల విషయానికొస్తే.. 2024లో మూడు సెంచరీలు సాధించిన సంజూ శాంసన్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. అయితే, రిషభ్ పంత్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో రెండో వికెట్ కీపర్ స్థానం కోసం పోటీ నెలకొంది. టాప్ ఆర్డర్‌లో ఇప్పటికే చాలా మంది ఆటగాళ్లు ఉండటంతో, లోయర్ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయగల ఆటగాడి కోసం జట్టు యాజమాన్యం చూస్తోంది. ఈ క్రమంలో కేఎల్ రాహుల్‌కు జట్టులో చోటు కష్టంగా మారింది. దీంతో, జితేశ్ శర్మ, ధ్రువ్ జురెల్ మధ్యే రెండో వికెట్ కీపర్ స్థానానికి ప్రధాన పోటీ నెలకొంది. 2025 ఐపీఎల్‌లో ఆర్‌సీబీ విజయంలో కీలక పాత్ర పోషించిన జితేశ్ శర్మకే ఎక్కువ అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఆల్‌రౌండర్లు, స్పిన్నర్లు వీరే

ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌ల ఎంపిక లాంఛనప్రాయమే. వీరిద్దరూ భారత జట్టులో అత్యంత కీలకమైన ఆటగాళ్లు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే, స్టార్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి కూడా జట్టులో స్థానం సంపాదించుకోవడం ఖాయం.

2024 టీ20 ప్రపంచకప్ విజయంలో భారత పేస్ దళానికి నాయకత్వం వహించిన జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ 2026లోనూ టైటిల్ నిలబెట్టుకోవడంలో కీలక పాత్ర పోషించనున్నారు. వీరిద్దరితో పాటు మూడో పేసర్ స్థానం కోసం హర్షిత్ రాణా ముందున్నాడు. బంతిని బలంగా నేలకు కొట్టే ప్రత్యేక నైపుణ్యం (హిట్ ది డెక్ బౌలర్)తో పాటు, బ్యాటింగ్ కూడా చేయగల సామర్థ్యం హర్షిత్‌కు అదనపు బలం. అతనిపై జట్టు యాజమాన్యానికి పూర్తి నమ్మకం ఉందని తెలుస్తోంది. ఒకవేళ, ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో మాదిరిగా ఒకే ఒక స్పెషలిస్ట్ పేసర్‌తో బరిలోకి దిగాలని జట్టు భావిస్తే, ఆల్‌రౌండ్ ఆప్షన్లను పెంచుకోవడానికి నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, లేదా శివమ్ దూబేలలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. ఈ మెగా టోర్నీకి ముందు (ఆసియా కప్ జరగకపోతే) భారత జట్టు కనీసం 18 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. కాబట్టి, కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌లకు వివిధ కాంబినేషన్లను ప్రయత్నించి, సరైన జట్టును ఎంపిక చేయడానికి తగినంత సమయం ఉంది.

# కాఫీ తాగే మహిళలకు శుభవార్త!



కాఫీ ప్రియులకు, ముఖ్యంగా మహిళలకు ఇది నిజంగా ఓ శుభవార్త! రోజూ మీరు ఆస్వాదించే కమ్మని కాఫీ కేవలం నిద్రమత్తు వదిలించడమే కాదు, మీ ఆయురారోగ్యాలను పెంపొందించి, ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి బాటలు వేస్తుందని తాజా అధ్యయనం ఒకటి సూచిస్తోంది. హార్వర్డ్ టీ.హెచ్. చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ మరియు టొరంటో విశ్వవిద్యాలయ పరిశోధకులు సంయుక్తంగా నిర్వహించిన ఈ అధ్యయనం, మహిళల దీర్ఘకాలిక ఆరోగ్యంపై కాఫీ సానుకూల ప్రభావాన్ని చూపుతుందని వెల్లడించింది.

### అధ్యయన వివరాలు, ముఖ్య ఫలితాలు

సుమారు 47,513 మంది మహిళల ఆహారపు అలవాట్లు, ఆరోగ్యంపై 30 ఏళ్ల పాటు సేకరించిన డేటాను విశ్లేషించిన ఈ అధ్యయనం పలు ఆసక్తికర విషయాలను వెలుగులోకి తెచ్చింది. ముఖ్యంగా, మధ్యవయసులో కాఫీని రోజూ సేవించే మహిళలు, వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా జీవించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని తేలింది. రోజుకు కనీసం 3 నుంచి 5 చిన్న కప్పుల (అనగా సుమారు 2.5 ప్రామాణిక కప్పులు లేదా 315 మిల్లీగ్రాముల కెఫిన్) కాఫీ తాగే మహిళల్లో చెప్పుకోదగ్గ ప్రయోజనాలు కనిపించాయని పరిశోధకులు తెలిపారు. "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం" అంటే 70 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసు వరకు జీవించడం, 11 ప్రధాన దీర్ఘకాలిక వ్యాధుల నుంచి విముక్తి, మంచి శారీరక పనితీరు, ఉత్తమ మానసిక ఆరోగ్యం, ఎటువంటి జ్ఞానపరమైన లోపాలు లేకపోవడం వంటి అంశాలను ఈ అధ్యయనంలో పరిగణించారు.

### ఇతర పానీయాలతో పోలిక

ఆశ్చర్యకరంగా, టీ లేదా ఇతర కెఫినేటెడ్ పానీయాల వల్ల ఆరోగ్యకరమైన వృద్ధాప్యంపై అంతగా సానుకూల ప్రభావం కనిపించలేదని ఈ అధ్యయనం పేర్కొంది. మరోవైపు, కెఫిన్ ఉన్నప్పటికీ, కోలా వంటి చక్కెర పానీయాలు ఆరోగ్యానికి హానికరం కావచ్చని కూడా పరిశోధకులు కనుగొన్నారు. కాఫీలో ఉండే ప్రత్యేక బయోయాక్టివ్ సమ్మేళనాలు ఈ ఆరోగ్య ప్రయోజనాలకు కారణం



కావచ్చని వారు అభిప్రాయపడ్డారు. అయితే, ఈ అధ్యయన ఫలితాలు ఇంకా నిపుణుల సమీక్ష (పీర్-రివ్యూ) పొందాల్సి ఉందని గమనించాలి.

నిపుణుల సూచనలు, హెచ్చరికలు

ఢిల్లీకి చెందిన పోషకాహార నిపుణురాలు డాక్టర్ సమీక్షా కల్రా మాట్లాడుతూ, "రోజుకు 2-3 కప్పుల కాఫీ తాగడం వల్ల కాలేయ క్యాన్సర్, డయాబెటిస్, గుండె జబ్బులు, డిప్రెషన్ వంటి అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. అయితే, మోతాదుకు మించి తీసుకుంటే ఆందోళన, నిద్రలేమి, జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు" అని హెచ్చరించారు. కాఫీ వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అది మాత్రమే సంపూర్ణ ఆరోగ్యానికి గీటురాయి కాదని గుర్తుంచుకోవాలి. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, తగినంత నిద్ర, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అత్యంత ఆవశ్యకమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కాబట్టి, కాఫీని మితంగా ఆస్వాదిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తే, మహిళలు దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించవచ్చు.

కాఫీ తాగే మహిళలు ఆరోగ్యంగా, ఎక్కువ కాలం జీవించే అవకాశం

హార్వర్డ్, టొరంటో విశ్వవిద్యాలయాల అధ్యయనంలో వెల్లడి

రోజుకు కనీసం 3 నుంచి 5 చిన్న కప్పుల కాఫీతో ప్రయోజనాలు

టీ, ఇతర కెఫినేటెడ్ పానీయాలతో పెద్దగా లాభం లేదని పరిశోధకుల వెల్లడి

అతిగా కాఫీ తాగడం వల్ల దుష్ప్రభావాలు తప్పవని నిపుణుల హెచ్చరిక

ఆరోగ్యానికి కాఫీతో పాటు మంచి జీవనశైలి కూడా అత్యవసరం



# ఆ కార్ల తయారీ నిలిపివేసిన మారుతి సుజుకి!




- చైనా రేర్ ఎర్త్ ఆంక్షలతో సుజుకి స్విఫ్ట్ ఉత్పత్తికి బ్రేక్
- మే 26 నుంచి జూన్ 6 వరకు స్విఫ్ట్ తయారీ నిలిపివేత
- విడిభాగాల కొరతే ఉత్పత్తి ఆగిపోవడానికి కారణం
- పలు దేశాల ఆటో, ఏరోస్పేస్ రంగాలపై చైనా నిర్ణయ ప్రభావం

జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ సుజుకి మోటార్, తమ పాప్యులర్ మోడల్ అయిన స్విఫ్ట్ కారు ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేసింది. చైనా ప్రభుత్వం రేర్ ఎర్త్ (అరుదైన మృత్తికలు) పదార్థాల ఎగుమతులపై ఆంక్షలు విధించడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ ఆంక్షల వల్ల అవసరమైన విడిభాగాలు లభించకపోవడంతో సుజుకి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. చైనా రేర్ ఎర్త్స్ ఎగుమతులపై విధించిన ఆంక్షల వల్ల ప్రభావితమైన తొలి జపనీస్ ఆటోమొబైల్ కంపెనీ సుజుకి కావడం గమనార్హం. స్విఫ్ట్ సబ్‌కాంపాక్ట్ మోడల్ (స్విఫ్ట్ స్పోర్ట్ మినహా) ఉత్పత్తిని మే 26 నుంచి జూన్ 6 వరకు నిలిపివేస్తున్నట్లు కంపెనీ గతంలోనే ప్రకటించింది. విడిభాగాల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో పేర్కొన్నప్పటికీ, ఆ కొరతకు దారితీసిన కారణాలను సుజుకి అధికారికంగా వెల్లడించలేదు. ఈ ఉత్పత్తి నిలిపివేతకు సంబంధించిన కారణాలపై వ్యాఖ్యానించడానికి కంపెనీ ప్రతినిధి నిరాకరించినట్లు తెలిసింది. ఈ వార్తను తొలుత నిక్కీ బిజినెస్ డైలీ పత్రిక ప్రచురించింది.

చైనా ఆంక్షలు - ప్రపంచ ప్రభావం

గత ఏప్రిల్ నెలలో చైనా ప్రభుత్వం అనేక రకాల రేర్ ఎర్త్ పదార్థాలు, వాటితో ముడిపడిన అయస్కాంతాల ఎగుమతులను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఆటోమొబైల్ తయారీ సంస్థలు, ఏరోస్పేస్ కంపెనీలు, సెమీకండక్టర్ల తయారీదారులు, సైనిక కాంట్రాక్టర్ల సరఫరా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ రేర్ ఎర్త్ పదార్థాలు అనేక కీలకమైన ఎలక్ట్రానిక్, మాగ్నెటిక్ భాగాల తయారీలో అత్యంత అవసరం.

చైనా ఆంక్షల కారణంగా కొన్ని యూరోపియన్ ఆటో విడిభాగాల తయారీ ప్లాంట్లు కూడా ఇప్పటికే తమ ఉత్పత్తిని నిలిపివేశాయి. ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్-బెంజ్ సైతం రేర్ ఎర్త్స్ కొరతను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు సమాచారం. చైనా తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయంగా అనేక పరిశ్రమలను సరఫరా సమస్యల్లోకి నెట్టింది.

## రెండు నెలలు బ్యాట్ టచ్ చేయలేదు..

# వింతగా అన్పించింది



వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్-2025 ఫైనల్‌కు సమయం ఆసన్నమవుతోంది. జూన్ 11 నుంచి 15 వరకు ప్రతిష్ఠాత్మక లార్డ్స్‌లో జరగనున్న తుది పోరులో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు అమీతుమీ తెల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి రెండోసారి ఛాంపియన్‌గా నిలవాలని ఆస్ట్రేలియా భావిస్తుంటే.. మరోవైపు దక్షిణాఫ్రికా తొలి ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే లండన్‌కు చేరుకున్న ఇరు జట్లు ప్రాక్టీస్‌లో మునిగి తేలుతున్నాయి. ఇక ఫైనల్ పోరుకు ముందు తన ప్రాక్టీస్‌పై ఆసీస్ స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రెండు నెలల పాటు కనీసం బ్యాట్‌ను కూడా తను టచ్ చేయలేదని స్మిత్ చెప్పుకొచ్చాడు. కాగా ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో సెమీఫైనల్లో ఆసీస్ ఓటమి తర్వాత.. స్మిత్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించి అందరికి షాకిచ్చాడు. ఆ తర్వాత తన సహచర ఆటగాళ్లు కొంతమంది ఐపీఎల్‌లో పాల్గొంటే.. మరి కొంతమంది డొమాస్టిక్ క్రికెట్‌లో ఆడారు. కానీ స్మిత్ మాత్రం న్యూయర్క్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకున్నాడు. తన తుంటి గాయంపై ట్రైనర్‌తో కలిసి పనిచేశాడు. "నేను సాధరణంగా ఇంటిలో ఖాళీగా ఉంటే షాడో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటాను. కానీ ఈసారి మాత్రం అందుకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. అందుకే న్యూయర్క్‌కు వెళ్లిపోయాను. నేను ఇక్కడికి వచ్చి ప్రాక్టీస్‌లో తొలి షాట్ ఆడేంతవరకు కనీసం బ్యాట్‌ను కూడా టచ్ చేయలేదు. చాలా రోజులు తర్వాత బ్యాట్ పట్టుకుంటే చాలా కొత్తగా అన్పించింది. రెండు ప్రాక్టీస్ సెషన్ల తర్వాత నా లయను తిరిగి నేను అందుకున్నాను. ఇప్పుడు అంతా బాగానే ఉంది. ప్రస్తుతం ఫిట్‌నెస్ పరంగా కూడా ఎటువంటి సమస్యలు లేవు. 2014లో ఎలా ఉన్నానో ఇప్పుడు కూడా అలానే ఉన్నాను. తుంటి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాను. ఇప్పుడు తిరిగి స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేసేందుకు సిద్దంగా ఉన్నాను. నేను ఇప్పటికీ ఓపెనర్‌గా రాణించగలనని భావిస్తున్నాను. కానీ నేను ఆడిన గత నాలుగు మ్యాచ్‌లలో అంత మెరుగ్గా రాణించలేకపోయాను. ఈ రోజుల్లో టాప్-4లో బ్యాటింగ్ చేసే ఎవరైనా ఓపెనర్‌గా రాణించగలరు" అని స్మిత్ ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com
సోమవారం - 23 - జూన్- 2025

# లక్ష టికెట్లతో 'మిషన్ ఇంపాజిబుల్' బెస్ట్ ఓపెనింగ్స్




టామ్ క్రూజ్ నటించిన 'మిషన్ ఇంపాజిబుల్- ది ఫైనల్ రికనింగ్' ఇండియాలో వేవ్స్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగులు రికార్డులు బ్రేక్ చేస్తున్నాయి. ఇంకా ముందస్తు బుకింగులు ఓపెన్ కాక ముందు, కేవలం 12 గంటల్లోనే టాప్ నేషనల్ మల్టీప్లెక్స్ చైన్లలో 1,00,000 టిక్కెట్లు అమ్ముడయ్యాయి. ఇది సిరీస్ లో ఎనిమిదో సినిమా కాగా, మునుపటి చిత్రానికి సీక్వెల్ గా తెరకెక్కింది. తాజా బాక్సాఫీస్ లెక్కల ప్రకారం..

ది ఫైనల్ రెకనింగ్ భారతదేశంలో ప్రారంభ రోజున రూ. 15 కోట్ల మార్కును అధిగమించి డెడ్ రికనింగ్ మొదటి భాగం వసూళ్లను అధిగమించింది. 2023లో రూ. 12.25 కోట్ల ఓపెనింగులతో పార్ట్ 1 విడుదల కాగా, పార్ట్ 2 ఆ రికార్డును చెరిపేసింది. ఈ శనివారం నాడు బుకింగుల్లో మరింత హుషారు కనిపిస్తుందని అంచనా.

క్రిస్టోఫర్ మెక్క్వారీ దర్శ కత్వం వహించిన 'ది ఫైనల్ రికనింగ్' గత ఏడాది వచ్చిన 'డెడ్ రికనింగ్'కు సీక్వెల్. 2 గంటల 49 నిమిషాల సుదీర్ఘ నిడివి ఉన్న చిత్రమిది. సీబీఎఫ్‌సి నుండి U/A సర్టిఫికేషన్ పొందింది. సమ్మెలు గొడవలతో నిర్మాణం పరంగా ఆలస్యాల్ని ఎదుర్కొన్న చిత్రబృందం 2024 చివరి నాటికి చిత్రీకరణను పూర్తి చేసి మే 5న టోక్యోలో ప్రీమియర్ ని ప్రదర్శించింది. మే 14న జరిగిన 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోను ప్రదర్శించారు. అక్కడ దీనికి 5 నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ లభించింది. ఈ చిత్రాన్ని భారతదేశంలో వయాకామ్ 18 పంపిణీ చేస్తోంది. దేశవ్యాప్తంగా 3,000 కంటే ఎక్కువ స్క్రీన్‌లలో విడుదల చేస్తున్నారు. టైర్-2 , టైర్-3 మార్కెట్‌లలో హిందీ-డబ్బింగ్ షోలపై దృష్టి సారించి, ఇంగ్లీష్ వెర్షన్‌తో టైర్-వన్ నగరాల్లోని మల్టీప్లెక్స్ ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని రిలీజ్ చేయ స్తున్నారని సమాచారం. భారత దేశంలో డెడ్ రెకనింగ్ మొదటి భాగం జీవితకాల వసూళ్లు రూ. 106 కోట్లు కాగా ఈ రికార్డును పార్ట్ 2 బ్రేక్ చేస్తుందని అంచనా.


# ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ ఎలా ఉంది..?

హాలీవుడ్ సినిమాల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉన్న సినిమాలు ఫైనల్ డెస్టినేషన్. అదేంటో తెర మీద జనాలు ఎలా చనిపోతారు అన్నది కథగా చూపిస్తూ ఫైనల్ డెస్టినేషన్ సీరీస్ లు ఆడియన్స్ లో ఒక భయాన్ని ఉతుకతను ఏర్పడేలా చేస్తాయి. దాదాపు పాతికేళ్ల క్రితం అంటే 2000 సంవత్సరం లో వచ్చిన ఫైనల్ డెస్టినేషన్ సినిమా సూపర్ హిట్ కాగా ఆ సినిమా చూసిన ఆడియన్స్ భయంతో వణికిపోయారు. ఐతే ఫైనల్ డెస్టినేషన్ ఈ పాతికేళ్లలో ఆరు సీరీస్ లు తీశారు. ఐతే లేటెస్ట్ సీరీస్ కు మాత్రం దాదాపు 14 ఏళ్ల దాకా టైం తీసుకున్నారు. లేటెస్ట్ గా ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ అంటూ కొత్త సీరీస్ ని ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చారు. ఈ కథ కూడా 1986 లోనే మొదలవుతుంది. ఆ టైం లో స్కై వ్యూ హొటల్ లో జరిగే ప్రమాదాన్ని ముందు ఊహించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఐరిస్ (గాబ్రియల్ రోస్) ప్రయత్నిస్తుంది. ఐతే అది అంత ఈజీ కాదన్న విషయం తెలుసుకుని తన వాళ్లను పోగొట్టుకుంటుంది. ఐతే ఎంతో ప్లానింగ్ తో ఉన్నా ఐరిస్ కుటుంబాన్ని చావు ఎలా వెంబడించింది అన్నదే ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ కథ. ఈ సినిమాలో కయిట్లిన్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేసింది. సీనియర్ ఐరిస్ గా గాబ్రియల్ అలా ఉన్న కొద్దిసేపైనా అదరగొట్టేసింది. ఇక ప్రతి పాత్రని దర్శకుడు చంపేసే సీన్స్ అయితే బాబోయ్ అనిపిస్తుంది. తెర మీద ఈ సీన్స్ అన్నీ ఎంతో న్యాచురల్ గా అనిపించడానికి సపోర్ట్ చేసిన సీజీఐ టీం ఇంకా కెమెరా వర్క్ ని మెచ్చుకోవాల్సిందే. ఐతే ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ ఇంపార్టెంట్ సీన్స్ అన్నీ కూడా ప్రోమోస్ లో వదలడం కాస్త ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఈ సినిమా టెక్నికల్ గా చాలా మంచి అవుట్ పుట్ ఇచ్చారు. ఐతే స్క్రీన్ ప్లే విషయంలో ఇంకాస్త వర్క్ చేసి ఉంటే బాగుండేది. ఈ ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్ కథ మరీ ప్రెడిక్టబుల్ గా ఉండటం స్క్రీన్ ప్లే కూడా అంత ఆసక్తికరంగా లేకపోవడం వల్ల జస్ట్ ఓకే అనిపిస్తుంది. ఆ సీరీస్ ని ఇష్టపడే ఫ్యాన్స్ ఇంకా ఇదే టైం హార్రర్ సినిమాలు ఇష్టపడే ఆడియన్స్ కి ఈ సినిమా నచ్చే ఛాన్స్ ఉంటుంది.



Cinema

# ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ ఎలా ఉంది..?




హాలీవుడ్ సినిమాల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉన్న సినిమాలు ఫైనల్ డెస్టినేషన్. అదేంటో తెర మీద జనాలు ఎలా చనిపోతారు అన్నది కథగా చూపిస్తూ ఫైనల్ డెస్టినేషన్ సీరీస్ లు ఆడియన్స్ లో ఒక భయాన్ని ఉతుకతను ఏర్పడేలా చేస్తాయి. దాదాపు పాతికేళ్ల క్రితం అంటే 2000 సంవత్సరం లో వచ్చిన ఫైనల్ డెస్టినేషన్ సినిమా సూపర్ హిట్ కాగా ఆ సినిమా చూసిన ఆడియన్స్ భయంతో వణికిపోయారు. ఐతే ఫైనల్ డెస్టినేషన్ ఈ పాతికేళ్లలో ఆరు సీరీస్ లు తీశారు. ఐతే లేటెస్ట్ సీరీస్ కు మాత్రం దాదాపు 14 ఏళ్ల దాకా టైం తీసుకున్నారు. లేటెస్ట్ గా ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ అంటూ కొత్త సీరీస్ ని ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చారు. ఈ కథ కూడా 1986 లోనే మొదలవుతుంది. ఆ టైం లో స్కై వ్యూ హొటల్ లో జరిగే ప్రమాదాన్ని ముందు ఊహించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఐరిస్ (గాబ్రియల్ రోస్) ప్రయత్నిస్తుంది. ఐతే అది అంత ఈజీ కాదన్న విషయం తెలుసుకుని తన వాళ్లను పోగొట్టుకుంటుంది. ఐతే ఎంతో ప్లానింగ్ తో ఉన్నా ఐరిస్ కుటుంబాన్ని చావు ఎలా వెంబడించింది అన్నదే ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ కథ. ఈ సినిమాలో కయిట్లిన్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేసింది. సీనియర్ ఐరిస్ గా గాబ్రియల్ అలా ఉన్న కొద్దిసేపైనా అదరగొట్టేసింది. ఇక ప్రతి పాత్రని దర్శకుడు చంపేసే సీన్స్ అయితే బాబోయ్ అనిపిస్తుంది. తెర మీద ఈ సీన్స్ అన్నీ ఎంతో న్యాచురల్ గా అనిపించడానికి సపోర్ట్ చేసిన సీజీఐ టీం ఇంకా కెమెరా వర్క్ ని మెచ్చుకోవాల్సిందే. ఐతే ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్ ఇంపార్టెంట్ సీన్స్ అన్నీ కూడా ప్రోమోస్ లో వదలడం కాస్త ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఈ సినిమా టెక్నికల్ గా చాలా మంచి అవుట్ పుట్ ఇచ్చారు. ఐతే స్క్రీన్ ప్లే విషయంలో ఇంకాస్త వర్క్ చేసి ఉంటే బాగుండేది. ఈ ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్ కథ మరీ ప్రెడిక్టబుల్ గా ఉండటం స్క్రీన్ ప్లే కూడా అంత ఆసక్తికరంగా లేకపోవడం వల్ల జస్ట్ ఓకే అనిపిస్తుంది. ఆ సీరీస్ ని ఇష్టపడే ఫ్యాన్స్ ఇంకా ఇదే టైం హార్రర్ సినిమాలు ఇష్టపడే ఆడియన్స్ కి ఈ సినిమా నచ్చే ఛాన్స్ ఉంటుంది.



# రణ్‌బీర్ 'రామాయణ'లో మండోదరి ఎవరు?



దంగల్ -% చిత్రంతో ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్నని దర్శకుడిగా రెండు వేల కోట్ల క్లబ్‌లో చేరిన నితేష్ తివారి ప్రస్తుతం భారతీయ ఇతిహాసం రామాయణాన్ని %-%రామాయణ%-%గా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. స్టోరీ స్క్రీన్‌ప్లే నమిత్‌మల్హోత్రా అందిస్తుండగా, స్టోరీని మాత్రం శ్రీధర్ రాఘవన్ అందిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి సీతారాములుగా నటిస్తున్న ఈ మూవీని నమిత్‌మల్హోత్రా, హీరో యష్ నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ రామాయణ ఇతిహాసాన్ని హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కిస్తున్నారు. ఇందులో మొదటి భాగాన్ని 2026 దీపావళికి విడుదల చేయనుండగా, రెండవ భాగాన్ని 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామని మేకర్స్ ఇటీవల ప్రకటించారు. ఇందులో రావణుడిగా యష్ నటిస్తుండగా హను మంతుడిగా సన్నీ డియోల్ కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రాకెట్ స్పీడుతో ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. క్రేజీ హీరోయిన్ కాజల్ అగర్వాల్ కూడా ఈ మేగ్నమ్ ఓపస్ లో భాగం అయినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనుందని, ఆమె మండోదరిగా నటించనుందని ఇన్ సైడ్ టాక్. యష్ రావణాసుడిగా నటిస్తుండగా అతనికి జోడీగా రావణుడి సతీమణి పాత్రలో మండోదరిగా కాజల్ కనిపిం చనుందని టాక్ వినిపిస్తోంది. అంతే కాకుండా ఇటీవలే కాజల్‌పై లుక్ టెస్ట్ కూడా జరిగిందని, త్వరలోనే టీమ్ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటిం చబోతోందని ప్రచారం జరుగుతోంది.

ఇదే నిజమైతే - రామయణ -% అనుకున్న దానికి మించి భారీ స్థాయిలో ఉండ నుందనే కామెం ట్‌లు వినిపి స్తున్నాయి.

భారతీయ సినిమాల్లో బడ్జెట్ పరంగా సరికొత్త చరిత్రకు నాంది పల కను న్న ఈ ప్రాజెక్ట్ ఆర్టిస్ట్‌ల విషయం లోనూ చర్చ నీయాంశంగా మా రడం కాయం.

# డాన్' డెన్‌లో కృతి ఎంట్రీ ఎప్పుడంటే..!



బాలీవుడ్ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా అన్ని భాషల ప్రేక్షకులకు డాన్ సినిమా చాలా స్పెషల్ అనడంలో సందేహం లేదు. ఇప్పటి వరకు వచ్చిన డాన్ ప్రాంచైజీ సినిమాల్లో షారుఖ్ ఖాన్ నటించాడు. డాన్ ప్రాంచైజీ సినిమాలు సూపర్ హిట్ అయిన నేపథ్యంలో డాన్ 3 కోసం హిందీ ప్రేక్షకులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. డాన్ 2 వచ్చిన దాదాపు 15 ఏళ్ల తర్వాత డాన్ 3 సినిమా రాబోతుంది. డాన్ 3 సినిమాలో షారుఖ్ ఖాన్ కాకుండా బాలీవుడ్ మరో క్రేజీ హీరో రణ్వీర్ సింగ్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఇప్పటికే సినిమాను పట్టాలెక్కించారనే వార్తలు వస్తున్నాయి. చిత్ర యూనిట్ సభ్యుల నుంచి అధికారికంగా ప్రకటన కోసం అభిమానులు వెయిట్ చేస్తున్నారు. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రూపొందుతున్న డాన్ 3 సినిమాపై అంచనాలు ఇప్పటికే భారీగా పెరిగాయి. అంచనాలకు తగ్గట్లుగా సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్, టెస్ట్ షూట్, ప్రీ విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ నడుస్తున్నట్లు ఆ మధ్య చిత్ర యూనిట్ సభ్యుల్లో ఒకరు చెప్పుకొచ్చారు.

సెప్టెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. ఈ సినిమాలో రణ్వీర్ సింగ్‌కు జోడీగా ఆదిపురుష్ హీరోయిన్ కృతి సనన్ నటించబోతుంది. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేసును కృతి సనన్ డాన్ 3 సినిమాలో ఎంట్రీ ఇవ్వడం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ధనుష్ హీరోగా ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'తేరి ఇష్క్ మైన్' సినిమాలోనూ కృతి సనన్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. త్వరలోనే ధనుష్, ఆనంద్ ఎల్ రాయ్ సినిమా పూర్తి కానుంది. కృతి సనన్ ప్రస్తుతం ధనుష్ సినిమాపైనే దృష్టి పెట్టిందని, ఆ సినిమా పూర్తి అయిన తర్వాత డాన్ 3 సినిమా షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తోంది. డాన్ 3 సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యే సమయంకు తేరి ఇష్క్ మైన్ సినిమా షూటింగ్ పూర్తి కావాలని కృతి సనన్ ఇప్పటికే నిర్మాతలతో చెప్పిందని సమాచారం అందుతోంది. ధనుష్ సినిమాలో కృతి సనన్ పాత్ర ఏంటా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కృతి సనన్ గత ఏడాదిలో తేరీ బాతోన్ మే ఐసా ఉలా జియా, క్రూ, దో పట్టి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలతో బాలీవుడ్‌లో మరింత బిజీ అయింది. అయితే డాన్ 3 సినిమాకు ఉన్న ప్రాముఖ్యత నేపథ్యంలో వచ్చిన కొన్ని ఆఫర్లను కృతి సున్నితంగా తిరస్కరించిందని తెలుస్తోంది. డాన్ 3 సినిమా వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు వస్తే, ఆ తర్వాత మరిన్ని సినిమాల్లో కృతి సనన్ నటించే అవకాశాలు ఉన్నాయి. నార్త్‌తో పాటు సౌత్ ఇండియాలోనూ వరుస సినిమాలు చేస్తూ, అక్కడ ఇక్కడ స్టార్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు దక్కించుకుని దూసుకు పోతున్న కృతి సనన్ మళ్లీ తెలుగులో ఎప్పుడు కొత్త సినిమాకు కమిట్ అవుతుందో చూడాలి.

# తీరిక లేని షెడ్యూళ్లతో నలిగిపోతున్న మిల్కీ



తీరిక లేని షెడ్యూళ్లతో నలిగి పోతున్న మిల్కీ 2005లో శ్రీ అనే చిత్రంతో కథా నాయికగా ఆరంగేట్రం చేసింది తమన్నా భాటియా. దాదాపు రెండు దశాబ్దాల కెరీర్ రన్ పూర్తి చేసింది. ఇలాంటి ఎగ్జయిటింగ్ కెరీర్ చాలా మంది సమకాలీన కథా నాయికలకు లేదు. కెరీర్ పోరాటం సాగించలేక మిడిల్ డ్రాప్ అయిన కథానాయికలు ఉన్నారు. కానీ ముంబై టు హైదరాబాద్ తమన్నా జర్నీ ఇంట్రెస్టింగ్. చాంద్ షా రోషన్ తమన్నాకు హిందీలో డెబ్యూ మూవీ. ఆ తర్వాత శ్రీ సినిమాతో తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టి, హ్యాపీడేస్ తో సంతృప్తికరమైన విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత నెమ్మదిగా అగ్ర కథానాయకుల సరసన అవకాశాలు అందుకుంది. తెలుగు, తమిళంలో టాప్ హీరోయిన్ గా స్టార్ డమ్ అందుకున్న తమన్నా బాహుబలి లాంటి పాన్ ఇండియా సినిమాలోను నటించింది. అయితే తమన్నా కెరీర్ లో విజయాల కంటే ఫ్లాపులే ఎక్కువ. అందువల్ల ప్రతిసారీ తమన్నా పని అయిపోయింది! అంటూ మీడియాలో ప్రచారం సాగేది. కానీ అన్నిటినీ అధిగమించి కెరీర్ బెస్ట్ ఫేజ్ కి ఎదిగింది తమన్నా. టాలీవుడ్ కోలీవుడ్ లో అగ్ర హీరోలందరి సరసనా కథానాయికగా నటించింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కూడా తమన్నా కెరీర్ బెస్ట్ ఫేజ్ ని ఆస్వాధిస్తోంది. ప్రస్తుత సంవత్సరంలో వరుసగా అరడజను ప్రాజెక్టులతో బిజీ బిజీగా ఉంది. ఇటీవల ఆజ్ కీ రాత్.. నషా వంటి ఐటమ్ నంబర్లతోను తమన్నా మెరుపులు మెరిపించింది. హిమ్మత్ వాలా, రైడ్ 2 తర్వాత అజయ్ దేవగన్ తో కలిసి %-%రేంజర్%-% లో నటిస్తోంది. అడవి నేపథ్యంలో ఇది భారీ యాక్షన్ ఎంటర్ టైనర్. అలాగే వేదా తర్వాత మరోసారి అబ్రహంజాన్ తో జతకట్టనుంది. సిద్ధార్థ్ మల్హోత్రా, వరుణ్ ధావన్, అర్జున్ కపూర్, దిల్జిత్ దోసాంజ్ లతో కలిసి రెండు వేర్వేరు ప్రాజెక్టులలోను నటిస్తోంది. వీటితో పాటు ఒక భారీ క్రేజీ వెబ్ సిరీస్ లోను తమన్నా భాగమైంది. కెరీర్ పరంగా ఇది బెస్ట్ ఫేజ్ అని తమన్నా భావిస్తోంది. టాలీవుడ్ లో ఓదెల 2 ఇటీవలే విడులైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పలువురు దర్శకులు తమన్నాకు స్క్రిప్టులు వినిపిస్తున్నారని సమాచారం. ఈ ఏడాది డిసెంబర్ తో తమన్నా 20 ఏళ్ల కెరీర్ ని దిగ్విజయంగా పూర్తి చేసుకోనుంది.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh,epaper. www.prabhatha suryaa.com. Email. Prabhata surya @gmail.com.Rni TGTEL/25/A0784.